జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 07 | హైదరాబాద్, మార్చి 25 శనివారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# ఎమర్జెన్సీని మించిపోతున్న మోదీ పాలన..

## రాహుల్ అనర్హత వేటుపై సీఎం కేసీఆర్ ఫైర్



హైదరాబాద్ : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ పాలన ఎమర్జెన్సీని మించిపోతుందని కేసీఆర్ మండిపడ్డారు. నేరస్తులు, దగాకోరుల కోసం ప్రతిపక్ష నాయకులపై అనర్హత వేటు వేసి మోదీ పతనాన్ని కొని తెచ్చుకుంటున్నారని కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌పై అనర్హత వేటు వేయడంపై కేసీఆర్ ప్రకటన విడుదల చేశారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో నేడు చీకటిరోజు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం నరేంద్రమోదీ దురంహంకారానికి, నియంతృత్వానికి పరాకాష్ట. రాజ్యాంగబద్ధ సంస్థలను దురుపయోగం చేయడమే కాకుండా అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటును సైతం తమ హేయమైన చర్యలకోసం మోదీ ప్రభుత్వం వినియోగించుకోవడం గర్హనీయం. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ విలువలకు చేటుకాలం దాపురించింది. మోదీ పాలన ఎమర్జెన్సీని మించిపోతున్నది. ప్రతిపక్ష నాయకులను వేధించడం పరిపాటిగా మారిపోయింది. నేరస్థులు, దగాకోరుల కొసం ప్రతిపక్ష నాయకులపై అనర్హత వేటు వేసి మోదీ పతనాన్ని కొనితెచ్చుకుంటున్నారు. పార్టీల మధ్య వుండే వైరుధ్యాలకు ఇది సందర్భం కాదు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం కోసం బీజేపీ ప్రభుత్వ దుశ్చర్యను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలి. బీజేపీ దుర్మార్గ విధానాలను ప్రతిఘటించాలి అని కేసీఆర్ పేర్కొన్నారు.

# త్వరలో రాజకీయ పార్టీగా..

# పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

### పది లక్షల మంది సభ్యత్వంతో రాజకీయ పార్టీ ప్రకటన..

### బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టడమే మా లక్ష్యం..

### పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పలు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ ముందుకు దూసుకెళ్తున్న పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్ )త్వరలో రాజకీయ పార్టీ గా ఆవిర్భావం చెందనుందని పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు ప్రకటించారు. పార్స్ ఆధ్వర్యంలో రేపు( మార్చి 26న) వంద కులాల ప్రతినిధులతో ఒకరోజు సదస్సు కార్యక్రమం నిర్వహించనుండగా ఆ కార్యక్రమం గురించి చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ కటికల శివ భాగ్యారావు మాట్లాడుతూ విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 100 కులాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశామని, బహుజనులకు రాజ్యాధికారం రావాలని పోరాడుతున్న పార్స్ త్వరలోనే రాజకీయ పార్టీగా ప్రజల ముందుకు రానుందని, జనాభాలో అధిక సంఖ్యాకులైన మధ్యతరగతి వర్గం (బిసి) వారే ముఖ్యమంత్రి గా ఉండాలని, వారే పెద్దన్న పాత్ర పోషించి,పూలే అంబేద్కర్ ఆశయాలైన సమసమాజ స్థాపన కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారి శ్రేయస్సు కోసం పాటుపడాలని అన్నారు. బహుజన కులాల నాయకులు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో రాష్ట్రంలో బహుజనులకు రాజ్యాధికార సాధన కోసం తీసుకోవలసిన నిర్ణయాలపై రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి ఈ సదస్సుకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ ఒక రోజు సదస్సు కు గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంటరీ స్థాయి నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన బహుజనులకు పిలుపునిచ్చారు. పూలే అంబేద్కర్ ఆలోచన విధానంతో ఉన్న ప్రతి ఒక్క పార్స్ సభ్యులు, బహుజనులు, అభ్యుదయవాదులు పార్స్ లోని 100 కులాల వారు,వారి కుల సంఘ నాయకులతో కలిసి ఈ కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

# రాహుల్ గాంధీపై అనర్హత వేటు..

## లోక్‌సభ సభ్యత్వం రద్దు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై.. లోక్‌సభ సెక్రటేరియేట్ అనర్హత వేటు విధించారు. లోక్‌సభ నుంచి ఆయన్ను డిస్‌క్వాలిఫై చేశారు. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు అయ్యింది. మార్చి 23వ తేదీ నుంచి అనర్హత వేటు అమలులోకి వస్తుందని లోక్‌సభ సెక్రటేరియేట్ తెలిపారు. ప్రధాని మోదీని ఇంటి పేరుతో దూషించిన కేసులో సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీపై వేటు పడింది. నేరపూరిత పరువునష్టం కేసులో దోషిగా తేలినందు వల్లే రాహుల్‌కు అనర్హత తప్పలేదు. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు లోక్‌సభ సెక్రటేరియేట్ తన లేఖలో తెలిపారు. దీంతో రాహుల్ గాంధీ 8 ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. లోక్‌సభ సెక్రటేరియేట్ ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదో తప్పుడు నిర్ణయమని మనీశ్ తివారి అన్నారు. ఒక ఎంపీని అనర్హుడిగా ప్రకటించే అధికారం లోక్‌సభ సెక్రటేరియేట్‌కు లేదన్నారు. రాష్ట్రపతి దీనిపై నిర్ణయం తీసుకోవాలని, అది కూడా ఎన్నికల సంఘంతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఇది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని ఎంపీ శశిథరూర్ ఆరోపించారు. కోర్టు తీర్పు ఇచ్చిన 24 గంటల లోపే ఈ నిర్ణయాన్ని ప్రకటించడం దారుణమన్నారు.

# సహనం కోల్పోయిన సిద్దారామయ్య



ఢిల్లీ: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కాసేపు సహనం కోల్పోయారు. ఉదయం ఆయన ఇంటినుంచి బయలుదేరే ముందు అక్కడ భారీగా నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు గుమిగూడారు. దీంతో పోలీసులు, బాడీగార్డులు వారిని పక్కకు నెడుతూ ఆయనను కారు దగ్గరికి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో ఓ మద్దతుదారుడు సిద్ధరామయ్యను కలిసే ప్రయత్నం చేశాడు. సిద్ధరామయ్య వద్దకు వచ్చి ఏదో చెప్పాలని అనుకున్న అతన్ని సిద్ధరామయ్య చెంపపై కొట్టాడు. అయినప్పటికీ అతను సిద్ధరామయ్య వెనకాలే కారు వద్దకు వెళ్లాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. చెంపదెబ్బకు గురైన వ్యక్తి సిద్ధరామయ్యకు స్వయంగా సహాయకుడని తెలుస్తోంది. మద్దతుదారలను సిద్ధరామయ్య చెంపదెబ్బ కొట్టడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో గతేడాది మైసూరు విమానాశ్రయం వెలుపల ఓ వ్యక్తిని కూడా ఆయన ఇలాగే కొట్టారు. ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మైసూరు జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన వరుణ నుంచి పోటీ చేయవచ్చునని ఆయన అన్నారు. ప్రస్తుతం వరుణ నియోజకవర్గంలో ఆయన కుమారుడు డాక్టర్ యతీంద్ర సిద్ధరామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో వరుణ నుంచి సిద్ధరామయ్య రెండుసార్లు గెలిచారు. 2013లో ఆ స్థానం నుంచే గెలిచి ముఖ్యమంత్రి కూడా అయ్యారు.



## కేజీవీబీలో విద్యార్థినిలకు వైద్య పరీక్షలు



శంకరపట్నం మార్చి 24 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో శుక్రవారం అంగన్వాడి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు మిల్లెట్స్ ఆహారం, బాలికల్లో రక్తహీనత అనే అంశాలపై వైద్యాధికారులు అవగహనా కల్పించారు. బాలికల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. అనంతరము విద్యార్థులకు ఎస్ ఎ రైటింగ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డా.వేణుగోపాల్, అంగన్వాడీ సూపర్వైజర్ స్రవంతి, అంగన్వాడీ టీచర్ సుమలత, ఏఎన్ఎంలు, పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్



జన్నారం, మార్చి 24, ప్రజాపాలన: తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత అవినీతి పాలన సాగిస్తున్నాడని, ఖానాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత జూన్, జూలైలో అధిక వర్షాలకు రాష్ట్రంలోని నష్టపోయిన ప్రజలను పట్టించుకొని కేసీఆర్, రెండు రోజల క్రితం కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తానని మోసపూరిత హమీలిస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కామ్ లో దోషులుగా తేలి విచారణ జరుగుతుందని, తెలంగాణ ప్రజలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలంలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని అరోపించారు. గ్రూపు హో1 పేపర్ లీకేజీతో పాటు సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వరకు కోచింగ్ లు తీసుకున్న పేద విద్యార్థులు అర్థికంగా నష్టపోయి అయోమయానికి గురవుతున్నారని దీనంతటికి ప్రభుత్వం భాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరి కొంతం శంకరయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేపీ సోషల్ మీడియా ఇంచార్జ్ బుర్ర గడ్డ జగన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు రాగుల సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో ముదిరాజ్ మహాసభ పునః సమీక్ష సమావేశం



శంకరపట్నం ప్రజాపాలన మార్చ్ 24: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ పునః సమీక్ష సమావేశంను శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా యువత అధ్యక్షుడు పండుగ బాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ సంఘాలు బలపడాలని గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ముదిరాజ్ మహాసభకి తోడుగా యువత కమిటీలను నిర్మాణం చేస్తేనే తెలంగాణ ముదిరాజ్ మహాసభ బలంగా ఉంటుందని అన్నారు. అప్పుడే ముదిరాజుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ముదిరాజులపై జరిగే అన్యాయాలను ఎదుర్కోవచ్చని తెలిపారు. గతంలో శంకరపట్నం మండలంలో ముదిరాజ్ సమస్యలపై అనేక సందర్భాల్లో పోరాటం చేశామని గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ముదిరాజుల ఏ సమస్య పరిష్కారానికైనా తెలంగాణ ముదిరాజ్ మహాసభ నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు. ముదిరాజ్ యువత మానకొండూరు నియోజకవర్గం ఇన్చార్జిగా కేశవపట్నానికి చెందిన గూళ్ల రాజుని ముదిరాజ్ యువత అధ్యక్షుడిగా, పోలు భరత్ ని నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు నూనె అశోక్, జిల్లా కార్యదర్శులు రాణవేణి గణేష్, పూదరి రాజు, ఎర్రవెల్లి సంపత్, రెడ్డి కుమార్ స్వామి, మండల ప్రధాన కార్యదర్శి రావణవేణి కుమార్, మండల ఉపాధ్యక్షులు పూదరి నాగరాజు, పోలు రమేష్, గట్టు సతీష్, రెడ్డి సంపత్, కోశాధికారి నూనె హరీష్, కార్యదర్శులు రెడ్డి సంతోష్, నిదురు కార్తీక్, గుండ్ల శేఖర్, మొలంగూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గుళ్ళ పాపయ్య, మండలం నాయకులు యువత పాల్గొన్నారు.

# మోడీకి అంత తొందరెందుకు ..?

### లక్ష ద్వీప్ ఎం.పి. మహమ్మద్ ఫైజల్ ఘటన మరిచిపోయారా..?
### రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బర్తరఫ్ చేయడం అనైతికం...
### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):లక్ష ద్వీప్ కు సంబందించిన ఎం.పీ. మహమ్మద్ ఫైజల్ కు కోర్టులో శిక్ష పడిన సందర్భంలో కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం ఫైజల్ ఎం.పీ. సభ్యత్వాన్ని రద్దు చేస్తే... కేరళ హై కోర్టు స్టే ఇచ్చిందని, ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకోకుండా కాంగ్రెస్ పార్టీ ఎం.పీ. రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఎందుకు అంత తొందరా..? అని ప్రశ్నించారు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ .గత నెలలో కేరళ హైకోర్టు ఇచ్చిన స్టే పై కేంద్ర బీజేపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించిందని, అయితే సుప్రీం కోర్టు కేరళ హైకోర్టు ఇచ్చిన స్టే ను సమర్థిస్తూ ఈనెలలో తీర్పు ఇచ్చిందని వినోద్ కుమార్ తెలిపారు. లక్ష ద్వీప్ ఎం.పీ. మహమ్మద్ ఫైజల్ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఈ.సీ.ఐ. నోటిఫికేషన్ ఇచ్చి కేరళ హైకోర్టు స్టే తో తిరిగి వాపస్ తీసుకోవాల్సి వచ్చిందని, ఫైజల్ ఎం.పీ. గా కొనసాగుతున్నారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. లక్ష ద్వీప్ ఘటన తెలిసీ కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు తొందర పడ్డారని, రాహుల్ గాంధీ విషయంలో నరేంద్ర మోడీకి ఎందుకు అంత తొందరా..? అని వినోద్ కుమార్ నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీని పార్లమెంట్ మెంబర్ పదవి నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బహిష్కరించడం అప్రజాస్వామికమని, అనైతికమని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ అని బోయినపల్లి వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను ప్రజాస్వామికంగా ఎదుర్కొనే ధైర్యం లేక.. అనైతిక చర్యలకు పాల్పడటం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి అలవాటై పోయిందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం దేశ ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని వినోద్ కుమార్ అన్నారు. సీబీఐ, ఈడీ దాడులతో విపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం.. ఇప్పుడు తాజాగా చట్టాన్ని కూడా దుర్వినియోగం చేస్తోందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పిలేట్ కోర్టుకు వెళ్లే అవకాశం రాహుల్ గాంధీకి ఉంటుందని, అప్పిలెట్ కోర్టుకు వెళ్ళే అవకాశం కూడా ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటు నుంచి రాహుల్ గాంధీని బర్తరఫ్ చేయడం ఎంత మాత్రం ఆమోద యోగ్యం కాదని వినోద్ కుమార్ అభిప్రాయ పడ్డారు. రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బర్తరఫ్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజాస్వామిక విలువలను కాపాడాలని వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## హరిత హారం మొక్కలకు ప్రాజెక్టుల భూములు: సి.ఎస్. శాంతి కుమారి

### పలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, మార్చి 24 : వచ్చే తెలంగాణాకు హరిత హారం కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కు చెందిన అనువైన భూములు గుర్తించి వాటిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. హరిత హారం, పల్లె ప్రగతి, కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, వేసవిలో అగ్నిప్రమాదాల నివారణ, పదవతరగతి పరీక్షల నిర్వహణ, ఇళ్ల స్థలాల సేకరణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్,పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వీ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఎస్సీ అభివృద్ధి శాఖ కమీషనర్ యోగితా రాణా,అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి, పీసీసీఎఫ్ డోబ్రియల్ తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అనువైన స్థలాల్లో హరిత హారం క్రింద పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరిగిందని, త్వరలోనే ప్రారంభం కానున్న 2023 -24 హరిత హారంలో ఆయా జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల కింద ఉన్న అనువైన స్థలాలను గుర్తించాలని తెలిపారు. బృహత ప్రకృతి వనాలకు అవసరమైతే అటవీ భూముల పై ప్రణాళిక తయారు చేయాలని. ఏప్రిల్ మాసాంతం వరకల్లా హరిత హారం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలు అగ్నిప్రమాదాల బారినపడకుండా తగు ముందు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్లను కోరారు. అగ్నిప్రమాదాల నివారణ కేవలం అగ్నిమాపక శాఖపైనే వదలకుండా అన్ని ప్రభుత్వ విభాగాలను, ప్రజలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన రెండు అగ్నిప్రమాదాలు ప్రస్తావిస్తూ, అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే చేపట్టాల్సిన ముందు జాగ్రత చర్యలపై ప్రజలను చైతన్యపర్చాలని తెలియచేసారు. అగ్నిప్రమాదాలు జరిగే అవకాశమున్న వాటిపై ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సి.ఎస్ కోరారు. ఏప్రిల్ 4 వ తేదీ నుండి 13 తేదీ వరకు జరుగనున్న పదవ తరగతి పరీక్షలకు 4.94 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఈ పరీక్షల నిర్వహణలో పకడ్బందీ ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు గతంలో మాదిరిగా 11 పేపర్లు కాకుండా ఈ సారి కేవలం ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో పోలీస్ శాఖ తోపాటు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 86.50 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 14.23 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణి చేశామని చెప్పారు. 10.73 లక్షల మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాల పంపిణి కొనసాగుతోందని అన్నారు. అదేవిధంగా. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంబించిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని అన్నారు జిల్లాలోని కంటి వెలుగు, ఆరోగ్య మహిళ శిబిరాలను కలెక్టర్లు సందర్శించి ఉత్తమ సేవలందే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. నిరుపేదలకు లబ్ది కలిగే 58 , 59 ,76 ,118 జీవో లపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి పట్టాలపంపిణీ, క్రమబద్దీకరణకై నిర్దేశించిన మొత్తాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పేదలకు నివాస భూములులను పంపిణి చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల అనుసరించి రాష్ట్రంలో 1039 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని తెలిపారు, వీటికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికలను పంపాలని జిల్లా కలెక్టర్లను కోరారు.

## ఉపేందర్‌కు నివాళులు అర్పించిన రామ్ నాయక్..



వైరా, మార్చి 24 (ప్రజాపాలన న్యూస్):వైరా మండలంలోని గరికపాడు గ్రామానికి చెందిన గుమ్మా ఉపేందర్ శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైయస్సార్ తెలంగాణ పార్టీ వైరా నియోజకవర్గ కో ఆర్డినేటర్ ధర్మ సోత్ రామ్ నాయక్ ఆయన మృత దేహానికి పూలవమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు మారుతి సతీష్, చంగల్ నాగరాజు, తిరుమలగిరి అంజి, మాతంగి రాము, తదితరులు ఉన్నారు.

## జాతీయ గ్రామపంచాయతీల అవార్డుల ప్రధానోత్సవం




శంకరపట్నం మార్చి 24 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఉమ్మెంతల సరోజన అధ్యక్షతన, ఎంపిఓ బషీరొద్దీన్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ అవార్డుల సన్మాన కార్యక్రమము నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ ఉమ్మెంతల సరోజన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నేషన్ పంచాయతి ఆవార్డు లో బాగంగా స్టేట్ సెలెక్షన్ కమిటి వారిచే జారి చేయబడన ఆన్లైన్ బేస్డ్ విధానము ద్వారా 9అంశాలపై పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి పంచాయితీ, ఆరోగ్యకరమైన పంచాయితీ, బాల-స్నేహపూర్వక పంచాయితీ, తదితర అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండలంలోని 24 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తేలిపారు. అలాగే పల్లెప్రగతి కార్యక్రము విజయవంతం చేసినందుకు అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్ లకు, ఎంపిటిసిలకు సన్మానం చేసారు. గ్రామాల అభివృద్దే దేశ అభివృద్ధి అని ఎంపీపీ సరోజన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, యం.పి.టి.సిలు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ పంచాయతి ఆపరేటర్స్ తధితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీని ఉద్దేశించి ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై లోక్‌సభ సెక్రటేరియట్ అనర్హత వేటు వేసిన అనంతరం ఈ వ్యవహారంపై ఆయన సోదరి, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా వరుస ట్వీట్లలో ప్రియాంక విమర్శలతో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ తానేం చేయదలుచుకుంటే అది చేయవచ్చని కానీ తమ కుటుంబం ఆయన ముందు తలవంచబోదని స్పష్టం చేశారు.మా నరాల్లో ప్రవహించే రక్తం ఎలాంటిదంటే.. మీలాంటి పిరికి, అధికార దాహం కలిగిన నియంత ముందు తాము తలవంచమని మోదీని ఉద్దేశించి ఆమె పేర్కొన్నారు. దేశ ప్రజల కంటే గౌతం అదానీనే అధికమని ప్రధాని మోదీ భావిస్తున్నారానా అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అదానీ లూటీ గురించి, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ గురించి నిజమైన దేశభక్తుడు రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే ప్రధాని ఉలిక్కిపడుతున్నారని అన్నారు.దేశ పార్లమెంట్, దేశంలోని గొప్ప వ్యక్తుల కంటే మీ స్నేహితుడు గౌతం అదానీ పెద్ద వ్యక్తని మీరు భావిస్తున్నారా అని మోదీని నిలదీశారు. రాహుల్ గాంధీ గొంతు నొక్కేందుకు ప్రభుత్వ యంత్రాగమంతా సామధాన బేధ దండోపాయాలను ప్రయోగిస్తోందని అన్నారు. తన సోదరుడు ఎన్నటికీ ఎవరికీ బెదిరిపోడని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. రాహుల్ వాస్తవాలే చెబుతారని, ఇక ముందూ వాస్తవాలే మాట్లాడతారని ప్రియాంక ట్వీట్ చేశారు.

## కంటి వెలుగు తో ప్రజల కంటి సమస్యలు దూరం: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల బ్యూరో, మార్చి 24, ప్రజాపాలన :కంటి వెలుగు తో ప్రజల కంటి సమస్యలు పూర్తి గా పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల 11, 12 వార్డులలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కంటి సమస్యలను దూరం నిర్వహిస్తున్న కంటి వెలుగు 2వ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 40 కేంద్రాలు ఏర్పాటు చేసి 40 బృందాలను నియమించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు శిబిరాలకు నిర్ధేశించిన లక్ష్యాలను సాధిస్తూ విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 183 గ్రామపంచాయతీలు, 92 మున్సిపల్ వార్డులలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, 2 లక్షల 43 వేల 654 మంది కంటి పరీక్షలు నిర్వహించి 48 వేల 78 మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందని, జిల్లాలో 15 వేల 677 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అవసరం ఉన్న వారికి రీడింగ్ అద్దాలతో పాటు ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరం ఉన్న వారికి సిఫారసు ద్వారా తెప్పించి అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 18 సం॥ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా? నీరజ, మున్సిపల్ కమీషనర్ రమేష్, కంటి వెలుగు శిబిరాల వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బి పి మండల కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి



మంచిర్యాల టౌన్, మార్చి 24, ప్రజాపాలన : బి పి మండల కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని బి సి సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్ లో జరిగిన బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రోజు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త బి సి ఉద్యమాలకు తలొగ్గిన జనతా ప్రభుత్వం 1979 వ సంవత్సరంలో బి సి లకు న్యాయం చేకూర్చుడానికి బి పి మండల కమిషన్ ఏర్పాటు చేసిన కమిషన్ 1982 లో బి సి లకు న్యాయం చేకూరే విధముగా 42 సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి 40 సంవత్సరాలు అవుతున్న దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి ఆ సిఫార్సుల అమలకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేక పోవడం అంటే ఇది పూర్తిగా బి సి ల పట్ల వ్యతిరేక వైఖరిగా భావిస్తున్నాం ఇప్పటికైనా సిఫార్సులు అమలు చేసి బిజెపి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కీర్తి రవి అజీజ్ శేంకర్ తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది: రెమా రాజేశ్వరి పోలీస్ కమీషనర్



మంచిర్యాల టౌన్, మార్చి 24, ప్రజాపాలన: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి ఆర్మేడ్ రిజర్వ్ విభాగం నందు పని చేస్తూ పదోన్నతులు పొందిన 68 మంది సిబ్బందిని రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి కార్యాలయంలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసు శాఖ కు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మోహన్, ఏ ఆర్ ఏ సి పి సుందర్ రావు, మధుకర్, శ్రీధర్, విష్ణు ప్రసాద్, రామగుండం కమిషనరేట్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచ లింగం, ఆర్ఎస్ఐ లు రాజేష్, ప్రవీణ్, అనిల్, విశ్వజా లు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు పుష్కర సన్మాన పత్రం



బోనకల్, మార్చి 24 ప్రజా పాలన ప్రతినిధి: మండల ప్రజా పరిషత్ కార్యాలయ నందు శుక్రవారం జాతీయ పంచాయితీ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు యం పి పి కంకణాల సౌభాగ్యం, యం పి డి ఓ బోడేపూడివేణు మాధవ్ , యం ఇ ఓ ఇందిరా జ్యోతి ,కో ఆప్షన్ సభ్యులు షైక్ జమాలుద్దీన్, రామాపురం యం పి టి సి యం. అప్పారావు, ఎస్ ఎల్ ఐ టి ఎస్ ఎన్ పి డి సి ఎల్ శేషగిరిరావు 9 టీమ్స్ గాను 17 గ్రామ పంచాయితీ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శులకు దీన దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతాత్ వికాస్ పురస్కార్ సన్మాన పత్రం ఇచ్చి ఘనంగా సన్మానించడం జరిగింది. అదేవిధంగా ది : 25.03.2023 న జిల్లా కార్యాలయం ఐ డి ఓ సి సమావేశం నందు జిల్లాచే ఎంపిక కాబడిన బోనకల్ , చిరునోముల సర్పంచ్, పంచాయితీ కార్యదర్శులకు అవార్డ్స్ ప్రదానోత్సవం చేయబడుననీ మండల పరిషత్ అధికారి తెలియజేశారు.

## మహిళల సంక్షేమం కోసం మహిళా ఆరోగ్య కేంద్రాలు

**జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**



మంచిర్యాల బ్యూరో, మార్చ్ 24, ప్రజాపాలన :మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం కుందారం గ్రామపంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రామ్ అధికారి డా? నీరజతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి రిజిస్టర్లు, ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన మహిళా ఆరోగ్య కేంద్రాలలో భాగంగా జిల్లాలో 4 మహిళ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి మంగళవారం ఆయా కేంద్రాలలో మహిళలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడంతో పాటు తీసుకోవలసిన పౌష్టికాహారంపై వివరించడం జరుగుతుందని తెలిపారు. వైద్య సేవల నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి వచ్చే మహిళల పట్ల గౌరవంతో మెలగాలని, మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. తిప్పారపు శ్రావ్య, ఎం.పి.పి. అనిల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు కేంద్రం ద్వారా మెరుగైన వైద్యం

**జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**



మంచిర్యాల బ్యూరో, మార్చి 24, ప్రజాపాలన:స్త్రీ, శిశు సంక్షేమానికి మాతా శిశు కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంను వైద్యాధికారి డా. నీరజ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి ఆసుపత్రిలోని ప్రసూతి వార్డుతో పాటు పలు వార్డులు, ఆసుపత్రి పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు కేంద్రం ద్వారా స్త్రీ, పిల్లల సంక్షేమం కోసం మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రసవాలు ఆసుపత్రులలో జరిగే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, సమయానుసారంగా అవసరమైన పరీక్షలు నిర్వహించుకొని వైద్యుల సూచన మేరకు పౌష్టికాహారం ఆహారం తీసుకుంటూ ఆరోగ్యవంతంగా ప్రసవించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మాతా శిశు కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఆసుపత్రికి వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు కేంద్రం వైద్యులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అడవుల రక్షణ పేరుతో ఆదివాసులకు అన్యాయం

**సిపిఐ (ఎం)రాష్ట కార్యవర్గ సభ్యులు ఎస్. వీరయ్య**



ఆసిఫాబాద్ జిల్లా మార్చి 2 4 (ప్రజాపాలన,ప్రతినిధి) :కేంద్రంలో ఉన్న బీజేపీ అడవుల రక్షణ పేరుతో కొత్త నియమావళి తీసుకువచ్చి ఆదివాసులకు తీరని ద్రోహం చేస్తోందని సిపిఐ(ఎం)రాష్ట కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్. వీరయ్య అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిపిఐ(ఎం) చేపడుతున్న జన చైతన్య యాత్ర శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ యాత్రకు పార్టీ జిల్లా శ్రేణులు, వివిధ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీపీఎం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల ప్రకారం గిరిజనుల సంఖ్య పెరిగిందని వీటి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని సీపీఎం తో పాటు మిగితా పార్టీలు డిమాండ్ చేసిన మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన మోడీ సర్కారు ససేమిరా అంటోందని విమర్శించారు. పర్యావరణం పేరుతో కేంద్రం కొత్త నిబంధనలు తయారు చేసిందని వీటి ప్రకారం 1/70, పెసా చట్టాన్ని నీరుగార్చి గిరిజనుల హక్కులు హరిస్తోందన్నారు. భూములు నేరుగా తీసుకొని అదాని, అంబాని, కాంట్రాక్టర్ లకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ళు ముడి సరుకు అమ్ముకొని వెళ్ళిపోతారని పర్యావరణం పట్టించుకోరని తెలిపారు. ప్రజల దృష్టి మరల్చుడానికి మతోన్మాదం రెచ్చగొడుతుందని అన్నారు. గిరిజన హక్కుల చట్టం ప్రకారం భూమి మీద వారికే హక్కులు ఉండాలన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రేట్లు అధికంగా ఇవ్వాల్సి ఉంటుందని కానీ దాన్ని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేసిందన్నారు. ఆదివాసీలు అమాయకులని వారికి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ చైతన్యపరిచే ఉద్దేశంతో జన చైతన్య యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు యాత్ర బృంద నాయకులు జయలక్ష్మి అడివయ్య స్కైలాబ్ బాబు జగదీష్ ఆశయ్య ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ బండారి రవికుమార్ జిల్లా కార్యదర్శి రాజన్న జిల్లా కమిటీ సభ్యులు దుర్గం దినకర్, అల్లూరి లోకేష్, కార్తీక్, రాజేందర్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్




మంచిర్యాల బ్యూరో, మార్చి 24, ప్రజాపాలన :జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శు క్రవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరం 6 వేల 910 మంది, ద్వితీయ సంవత్సరం 7 వేల 758 మంది మొత్తంగా 14 వేల 668 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో విద్యార్థుల సౌకర్యం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 7780129509 నంబర్లు సంప్రదించవచ్చని తెలిపారు. పరీక్ష కేంద్రాల నిర్వహణ లోటుపాట్లపై ఎలాంటి సందేహాలు ఉన్నా కంట్రోల్ రూమ్ లో సంప్రదించాలని, విద్యార్థుల కోసం ఒత్తిడి జయించడానికి టెలీ మానస్ అనే టోల్ ఫ్రీ నెంబర్ 14416 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ జాతీయస్థాయి పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్




బోనకల్ ,మార్చి 24 ప్రజా పాలన ప్రతినిధి: నేషనల్ గ్రామ పంచాయతీ అవార్డు లో బాగంగా క్లీన్ అండ్ గ్రీన్,సామాజికంగా న్యాయంగా సామాజికంగా సురక్షితమైన గ్రామం పేదరికం లేని ప్రకటన మెరుగైన జీవనోపాధి గ్రామం నేషనల్ పంచాయతీ అవార్డు రావినూతల కు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ ని శాలువా,దండ,మెమెంటో ప్రశంశ పత్రంతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డు రావటానికి కృషి చేసిన ఉప సర్పంచ్ కి, యం పి టి సి కి, వార్డు సభ్యులకు, ఆశా వర్కర్లుకు, అంగన్వాడీ టీచర్లుకి, ఐ కె పి లకు, పంచాయతీ సిబ్బందికి ,గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యం పి పి కంకణాల సౌభాగ్యం , యం పి డి వో వేణు మాధవ్ , సర్పంచ్ లు, యం పి టి సి లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
శనివారం 25, మార్చి 2023

# రక్తదాహం ముగుస్తోందా?

రణరంగం కానిచోటు.. భూ స్థలమంతా వెదికిన దొరకదు... గతమంతా తడిసెను రక్తమున.. కాకుంటే కన్నీళులతో.. చరిత్ర స్వభావం గురించి ఇంత గొప్పగా చెప్పే కవిత్వం అరుదుగా కనపడుతుంది. సమాజంలో యుద్ధాలు, హింస నిర్వహించిన పాత్ర గురించి ఎంతైనా రాయొచ్చు. చరిత్ర పుస్తకాల్లో వీటి ప్రస్తావనలే ఎక్కువ. ప్రాచీన సాహిత్యమంతా ఏదో రకంగా యుద్ధం, హింస చుట్టూనే ఎక్కువగా తిరిగింది. దేవాసురుల యుద్ధాలు లేకపోతే మనం ఎన్ని కథలను కోల్పోతామో ఊహించుకోండి! ధర్మ స్థాపన కోసం యుద్ధాలకు దిగటాన్ని మన సంప్రదాయం తప్పుపట్టలేదు. రాజ్యం వీరభోజ్యం అనే భావన రక్తపుటేరులు పారించింది. హిందువులు యుద్ధ ప్రియులు కాదనటానికి చరిత్రలో ఆధారాలు దొరకవు. ప్రాచీన, మధ్య యుగాల్లో హింస గురించి ఎవరికీ సందేహాల్లేవు. ఆ హింస కాలం గడిచేకొద్దీ పెరుగుతోందా? తరుగుతోందా? అనే ప్రశ్నలకు మాత్రం ఇటీవల వరకూ సమగ్ర సమాధానాలను అన్వేషించలేదు. పారిశ్రామిక యుగం మొదలైన తర్వాత హింస తగ్గుముఖం పడుతోందని మనం కలలో కూడా ఊహించలేం. యంత్ర నాగరికతతో వచ్చిన, వస్తోన్న మారణాయుధాల వల్ల యుద్ధాల్లో కోట్లమంది చనిపోయారు. రెండు ప్రపంచ యుద్ధాలు, ఫ్రెంచ్, రష్యన్, చైనా విప్లవాలు, వలస వ్యతిరేక పోరాటాలు, రైతాంగ ఉద్యమాలు, గిరిజనుల తిరుగుబాట్లు, ఖండ ఖండాల్లో అల్ప సంఖ్యాక ప్రజల ఊచకోతలు, నాజీల నరమేధం.. ఇట్లా చెప్పుకుంటూ పోతే మనుషుల ప్రాణాలను హరించే రక్తదాహాలు, హింసలు పెట్రేగి పోతున్నాయనే మనం భావిస్తాం. మన ఆలోచనల్లో హింసా చిత్రం బలంగా పాతుకుపోయింది. దీనికి భిన్నంగా ఎవరైనా చెబితే మనం దిగ్భ్రాంతి చెందుతాం. సరిగ్గా అట్లాంటి దిగ్భ్రమనే ప్రముఖ కగ్నిటివ్ సైకాలజిస్టు, సైకో లింగ్విస్ట్ స్టీవెన్ పింకర్ కలగచేశారు. మానవ సమాజంలో హింస గణనీయంగా తగ్గుతోందని చెబుతూ "ద బెటర్ ఏంజెల్స్ ఆఫ్ అవర్ నేచర్" అనే పేరుతో ఒక ఉద్గ్రంథాన్ని రాశారు. 832 పేజీల ఈ పుస్తకంపై ఇంకా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. తను చదివిన అత్యుత్తమ పుస్తకంగా బిల్‌గేట్స్ దాన్ని వర్ణిస్తే, దాన్ని దుయ్యబట్టిన వారిలో లెఫ్ట్, రైట్ మేధావులూ ఉన్నారు. మానవ చరిత్రలో ఇప్పుడున్నంత శాంతియుతంగా మనం ఎప్పుడూ లేమనే ప్రతిపాదనతో పింకర్ పుస్తకం మొదలవుతుంది. ఆశ్చర్యంగా ఉన్నా పింకర్ విశ్లేషణ అలానే ఆరంభమైంది. ఆదిమ యుగంలో.. అంటే వ్యవస్థీకృత రాజ్యాలు (స్టేట్స్) లేని దశలో మనుషుల మనుగడ లక్షల ఏళ్లు సాగింది. ఆనాటి మనుషులను కల్లాకపటం ఎరుగని సాధుజీవులుగా ఫ్రెంచ్ తత్వవేత్త రూసో చెప్పారు. పింకర్ దృష్టిలో అది నిజం కాదు. 5000 ఏళ్ల క్రితం వివిధ చోట్ల రాజ్య వ్యవస్థ మొగ్గతొడగటం మొదలైంది. ఆ దశకు ముందు మనిషి జీవితానికి ఎటువంటి రక్షణ లేదు. ఇతర తెగల ప్రజలను చంపటం పలు చోట్ల సర్వసాధారణం. జంతు ప్రవృత్తితో మనుషులు తలపడేవారు. కొత్తవారు తారసపడితే చంపటమో వారి చేతుల్లో చావటమో జరిగేది. మొత్తం మరణాల్లో సగటున 15 శాతం మంది ఆనాడు పరస్పర దాడుల వల్ల చనిపోయేవారు. కొన్నిచోట్ల ఇది 60 శాతం వరకూ ఉండేది. ఈ పరిస్థితిని కిందటి శతాబ్దంతో పోల్చిచూద్దాం. ఎందుకంటే 20వ శతాబ్దాన్ని మనం అత్యంత క్రూరమైందిగా భావిస్తాం. దారుణ ప్రపంచ యుద్ధాలు, అంతర్యుద్ధాలు, జాతి మతం పేరుతో జనహననాలు, మనిషి సృష్టించిన కరవు కాటకాలు.. ఇలా ఎన్నో ఘోర ఘటనలు కోట్ల మనుషుల ప్రాణాలను తీశాయి. వీటన్నిటినీ లెక్కవేసినా 20వ శతాబ్దంలో హింస వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య మొత్తం మరణాల్లో మూడు శాతం మాత్రమే. ఇక 21వ శతాబ్దాన్ని తీసుకుంటే హింసవల్ల ప్రాణాలు కోల్పోయిన వారు మొత్తం మరణాల్లో ఒక శాతం కంటే చాలా చాలా తక్కువ. ఖచ్చితంగా చెప్పుకొంటే ఒక శాతంలో మూడు వందల వంతు మాత్రమే! వేల ఏళ్ల నాటి సంగతి వదిలేద్దాం. రెండు మూడు వందేలేళ్ల క్రితం వరకూ రాజ్య వ్యవస్థలంటూ తెలియని తెగలు చాలా చోట్ల ఉండేవి. వాటిని పరిశీలించినా హింస పాత్ర ఏమిటో నిర్దిష్టంగా తెలుస్తుంది. ప్రతి లక్ష జనాభాకు 500 నుంచి 1500 వరకూ యుద్ధ-హింసాత్మక మరణాలు ఆ తెగల్లో సంభవించేవి. కిందటి శతాబ్దంలో అత్యంత దారుణాలకు జర్మనీ నిలయమని మనందరికీ తెలుసు. అటువంటి జర్మనీలో లక్షకు 135 మంది మాత్రమే హింస-యుద్ధాల కారణంగా మరణించారు. ఇక రష్యాలో 130 మంది, జపాన్‌లో 30 మంది చొప్పున చనిపోతే అమెరికాలో ఆ సంఖ్య నామమాత్రమే. అన్ని రకాల హింసాత్మక మరణాలను పరిగణనలోకి తీసుకున్నా 20వ శతాబ్దంలో అలా ప్రాణాలు పోయిన వారు లక్షమందికి 60కి మించలేదు. రాజ్య వ్యవస్థ ఏర్పడటం హింస తగ్గటంలో తొలి కీలక అడుగు. యుద్ధాలను, దాడులను ఆపటం రాజ్యాలకు అత్యవసరం. తెగలు, జాతులు, కులాలు మధ్య సంఘర్షణలు కొనసాగితే పన్నులు, శిస్తుల వసూళ్లు దెబ్బతింటాయి. అందుకే రాజ్యాలు హింసను అదుపులో పెట్టటానికి కృషి చేశాయి. పన్నుల వసూళ్ల కోసం అంతర్గత హింసను తగ్గించినా రాజ్యాల మధ్య యుద్ధాలు ఆగలేదు. ఆ దిశగా సమాజ పరివర్తన తర్వాత కాలంలో జరిగింది. తెగ జీవితం చెదరిపోయి సమాజంలో వర్గాలు, అంతరాలు ఏర్పడిన తర్వాత వ్యక్తిగత కక్షలు, దురాశ, ఆర్థిక సమస్యలతో హత్యలు, చంపటాలు జరిగేవి. లక్షలో 10 నుంచి 100 మంది దాకా ఇట్లా మరణించేవారు. అవి కూడా క్రమేపీ తగ్గుముఖం పట్టాయి. 1300 నుంచి 2000 వరకూ 700 ఏళ్లలో యూరపులో ఇట్లా మరణించేవారి సంఖ్య బాగా తగ్గింది. ప్రస్తుతం లక్ష జనాభాకు సగటున ఒకరు మాత్రమే ఆ రీతిలో ప్రాణాలు కోల్పోతున్నారు. కేంద్రీకృత రాజ్యాలు ఈ 700 ఏళ్లలో పెరగటం కూడా ఇందుకు దోహదం చేశాయి. వ్యాపార ప్రయోజనాల కోసం రాజ్యాలు యుద్ధాలకు దిగటం చరిత్రలో కొత్తకాదు. ఈస్ట్ ఇండియా కంపెనీ లాంటివి భారత్‌లో చేసిన యుద్ధాలు అందరికీ తెలిసినవే. నాణేనికి ఇది ఒక వైపు మాత్రమే. లోతుగా చూస్తే నాగరికతల మధ్య వ్యాపారం వారధులు వేసింది. సంస్కృతుల మధ్య ఇచ్చిపుచ్చుకోటానికి కారణమైంది. భాషలు, భావాల మధ్య సంపర్కాన్ని పెంచింది. వ్యాపారం సమాజంలో పాదుకోకముందు సమూహాలపై పడి దోచుకోవటం, అడ్డువస్తే చంపివేయటం జరిగేది. వస్తువులు, పంటలతో పాటు వాటిని ఉత్పత్తిచేసే వ్యక్తులూ హననమయ్యేవారు. ఈ దారుణం కంటే వస్తువులు, సేవలను పరస్పరం పంచుకోవటం సమాజానికి ఎంతో లాభం. అసమానంగా నైనా వివిధ వర్గాలకు శాంతియుతంగా కొన్ని ప్రయోజనాలు దక్కుతాయి. అందుకే వ్యాపారం పెరిగే కొద్దీ హింస తగ్గటం మొదలైంది. రాజ్యాలు అమలుచేసే క్రూర శిక్షలు కూడా బాగా తగ్గాయి. కొరడాలతో కొట్టి చంపటాలు, సజీవ దహనం చెయ్యటాలు, అంగ విచ్ఛేదనలు, కళ్లు పొడవటాలు లాంటి భయంకర శిక్షలు ఉండేవి. పారిశ్రామిక విప్లవానికి ముందే ముద్రణ యంత్రం రావటంతో పుస్తక ప్రచురణ బాగా పెరిగింది. కొత్త భావాలు వ్యాపించాయి. మూఢ నమ్మకాలు తొలగటం మొదలయ్యాయి. సాహిత్యం, కళల ద్వారా ఒక మనిషి, ఒక సమూహం, ఒక బృందం అంతరంగాలను తెలుసుకోవటం బాగా సుసాధ్యమైంది. మనిషిలోని ఆర్తి, అనురాగం, ఆవేదన, అనందం, అపేక్ష, కరుణ లాంటి విశ్వజనీన లక్షణాలను గమనించటంలో గాఢత పెరిగింది.

# దళిత బహుజనులే దేశ నిర్మాతలు

భారతదేశాన్ని హిందూ సాంస్కృతిక దేశంగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి భారతదేశం అతి ప్రాచీనమైన నదీ నాగరికత, సంపద కలిగిన దేశం. ఆర్యులు భారతదేశానికి రాకముందే సింధూ నాగరికత ఇక్కడ పరిఢవిల్లింది. సింధూ నాగరికతకు ముందే మాతృస్వామ్య వ్యవస్థ ఇక్కడ విస్తృతంగా వర్ధిల్లింది. భారతదేశంలో తల్లి సంస్కృతి వర్ధిల్లిన క్రమంలో ఆహార సేకరణ జరిగింది. నిజానికి భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని ఎవరు అర్థం చేసుకున్నారో, భారతదేశంలో ఉత్పత్తి క్రమాన్ని ఎవరు రూపొందించారో, ఇక్కడ కొండలు, లోయలు, జలపాతాలకు అనుగుణంగా ఎవరు తమ జీవన వ్యవస్థలను తీర్చిదిద్దుకున్నారో, ఎవరు భారతదేశ సంస్కృతీ వికాసానికి నిలువెత్తు సాక్ష్యాలో, ఎవరి అడుగుల చప్పుళ్ళతో ఇక్కడ కొండలు పులకరిస్తాయో ఇక్కడి నేల పండి ఒరుగుతుందో ఎవరు ఈ దేశానికి వలస వచ్చిన అనేక జాతులతో యుద్ధం చేసి కొన్నిసార్లు గెలిచి, కొన్నిసార్లు ఓడి ఈ దేశాన్ని ఒదిలిపెట్టకుండా తమ దేశీయతను చాటుకొన్నారో, ఎవరు అనేక తాత్విక ధారలకు సృష్టికర్తలో ఆ మూలవాసులకు, అస్పృశ్యులు అని పేరు పెట్టారు. వారి అణచివేతనే భారతదేశ చరిత్రగా తీర్చిదిద్దారు. భారతదేశాన్ని ఎందరో పాలకులు పరిపాలించారు. వారు భిన్న జాతులకు సంబంధించిన వారు. కాని సంస్కృతి అంతః ప్రవాహంగా ఉత్పత్తి పరికరాల పునాది మీదే నడుస్తుంది. ఒక గొడ్డలి ఎంతో పరిణామానికి మూలమైంది. ఒక్కొక్క ఉత్పత్తి పరికరం మన సంస్కృతినే మార్చి వేసింది. వలతో చేపలు పట్టడం ద్వారా, ఉలితో చెక్కను చెక్కడం ద్వారా ఎంతో పరిణామం జరిగింది. భారతదేశం ప్రతి పాలకునికి అర్థం కావాలని ఏమీ లేదు. ఆర్యులకు, యవనులకు, కుషానులకు, అరబ్బులకు, మొగలులకు, బ్రిటీష్ వాళ్ళకు, భారతదేశం అర్థం అయ్యిందని చెప్పలేం. వారంతా మూలధనాన్ని, మూల వాసుల్ని అణచివేయడానికి ప్రయత్నించిన వారే. క్రీస్తు పూర్వం 50 వేల సంవత్సరాల చరిత్రను వైదిక శఖం భారతీయ మూలవాసుల మూలాలను దెబ్బతీసింది. సంస్కృత భాషలోని కృత్రిమ కల్పనలు, నీచార్థాలను సృజించి, భారతీయుల సాంస్కృతిక మూలాలను దెబ్బ తీయడానికే ఎక్కువ ప్రయత్నం చేయడం జరిగింది. సామరస్యమూ, శాంతి, ప్రేమతో కూడిన మూలవాసుల భావనలను ధ్వంసం చేసే క్రమంలో బీభత్స, భయానక రసాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వలన చాలా చరిత్ర వక్రీకరించబడింది. ప్రధానమంత్రి క్రైస్తవులకు, ముస్లీంలకు దగ్గర కమ్మంటున్నారు. నిజమైన సంస్కృతీ వికాసం మతవాదుల్లో లేదు. హేతువాదులు, భౌతికవాదులు, అంబేద్కర్ వాదులు లౌకికవాదుల్లో వుంది. అసలు భారత దేశానికి మొదటి దర్శనం-చార్వాక దర్శనం, రెండవ దర్శనం- జైన దర్శనం, మూడు - బౌద్ధ దర్శనం, నాలుగు - సాంఖ్య దర్శనం. ఇవన్నీ నిరీశ్వర వాద దర్శనాలే. బౌద్ధ దర్శనం సాంఘిక సమానత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలబడింది. బౌద్ధ దర్శనం మూలవాసుల నుండి జనించింది. పుట్టుక మరణం యొక్క మూలాలను అన్వేషించి మానవుడు ప్రకృతిలోనుండి జనిస్తాడు. ప్రకృతిలోకి నిర్యాణం చెందుతాడని తేల్చి చెప్పింది. శీలం అనగా నైతిక ప్రవర్తనని. నిష్కామం అనగా ప్రాపంచిక సుఖాల పట్ల వైముఖ్యం చూపటమని. వీరమనగా కృత నిశ్చయతని నిర్వర్తించదలుచుకున్న సత్కార్యాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ మోసపోకుండా చేయడమే వీరమని, సాహస ప్రవర్తనమే కాంతి అని, సుఛ అనగా సత్యవర్తనమని, సంకల్పం అనగా నీ ధ్యేయ సాధన పట్ల స్థిర నిశ్చయంతో కృషి చేయటమని, మానవాళి పట్ల దయార్ధ్ర దృష్టితో మెలగడం కరుణని సాటి వారి పట్ల సౌహార్ధ్ర దృష్టితో మెలగడమే మైత్రి అని ఈ సౌశీల్య విధానాలు ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా పాటించాలని బుద్ధుడు ప్రభోదించాడు. బుద్ధుడు వ్యక్తి నిర్మలత్వానికి కూడా ప్రాధాన్యం ఇచ్చాడు. ఒక వ్యక్తి నిర్మలత్వానికి దురాశ, వ్యామోహం, అజ్ఞానం, ప్రాణహాని, దొంగతనం, వ్యభిచారం, అబద్ధమాడటం వంటి అవలక్షణాలు హానికరమని ఆయన ఉద్బోధించాడు. బుద్ధుని సిద్ధాంతాలు అప్పటి వరకు వైదిక సంస్కృతి ఆచరణ లోకి తీసుకు వచ్చిన మూఢ నమ్మకాలను, యజ్ఞ యాగాదులను వ్యక్తి స్వార్ధాన్ని, దుష్ట ప్రవర్తనను ఖండించి నూత్న సామాజిక దృక్పథాన్ని ప్రబోధించాయి. బుద్ధుడు తన హేతువాద దృక్పథంతో మానవ మేథో



సంపత్తికనుగుణంగా ఎలా నూత్న సిద్ధాంతాన్ని రూపొందించాడో చెబుతూ జస్టిస్. ఆర్.ఆర్.భోలె ఇలా వ్యాఖ్యానించారు. బౌద్ధం శ్రామిక సంస్కృతికి అనుబంధంగా ముందుకు వచ్చింది. శ్రామిక కులాలన్నీ బౌద్ధంలో ఇమిడిపోయాయి. నిజానికి క్రీ॥పూ 6వ శతాబ్దం నుండి భారతదేశం బౌద్ధ సంస్కృతిలోనే నడిచింది. భారత రాజ్యాంగంలో అంబేద్కర్ బౌద్ధ సూత్రాలను పొందుపరిచారు. ఏ మతం వారైన ఆ మతాన్ని వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి గాని, దాన్ని రాజ్యం మీదకు రుద్దకూడదు. నిజానికి భారతదేశ సంస్కృతీ నిర్మాతలైన దళితులు, బహుజనులు, ఆదివాసులు ఇప్పటికి నదుల్ని ప్రేమిస్తారు. వీరిలో హింసావాదం లేదు. హింసకు వీళ్ళు వ్యతిరేకులు. వీరు మానవ జీవన వికాస ప్రకాశితులు. వీరికి జీవించే హక్కు కావాలి. అయితే భారతదేశంలో ఈనాడు జీవించే హక్కు కాలరాయబడుతుంది. అయితే మతం, మత స్వేచ్ఛ గురించి చర్చించుకునే క్రమంలో మనం ప్రధానంగా గమనించాల్సింది ఏమిటంటే లౌకిక భావంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వాలే మత తత్వాన్ని ప్రేరేపిస్తున్నాయి. మరోప్రక్క భారత రాజ్యాంగం అమలు జరిగిన రోజు జనవరి 26న రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతింటుందని భారతీయులందరూ ఆందోళనలో ఉన్నారు. 179 దేశాల్లో భారతదేశం 93వ స్థానానికి ఆర్థిక సూచిలో దిగజారి పోయింది. సుసంపన్నమైన భారతదేశంగా చెప్పబడుతున్న మన నేలలో ఆకలి చావులతో మరణిస్తున్న వారి సంఖ్య పెరగడం ఆశ్చర్యం. ముఖ్యంగా అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య కూడా పెరిగింది. కుల, మత, అసమానతలు నిరంతరం పెరుగుతున్నాయని అణచివేతలు, గృహహింస విపరీతంగా పెరిగిపోతున్నాయని సామాజిక సర్వేలు చెపుతున్నాయి. మరోప్రక్క కార్పోరేట్ పెట్టుబడిదారీ సామ్రాజ్యాన్ని అదానీ, అంబానీ వంటి శక్తులు అక్రమంగా విస్తరిస్తూ వెళ్తున్నాయి. మరోప్రక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అదానీ గ్రూపులు గంగవరం, కృష్ణపట్నం పోర్ట్, విశాఖ ఉక్కు పరిశ్రమ, బందర్ పోర్ట్, కృష్ణపట్నం థర్మల్ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ప్లాంట్లు కైవసం చేసుకుంటూ వెళుతున్నారు. అదాని ఎంటర్‌ప్రైజెస్ ముఖ్యంగా దేశంలోని అతిపెద్ద బొగ్గు వాణిజ్య సంస్థ గానూ, అతిపెద్ద ప్రైవేట్ ఎయిర్ పోర్ట్ ఆపరేటర్ గాను విస్తరిస్తూ వెళ్తుంది. 2018లో భారత ప్రభుత్వం ఆరు విమానాశ్రయాలను అదానీ గ్రూప్‌కి ధారధత్తంగా ఇచ్చింది. అహ్మదాబాద్, మంగుళూరు, లక్నో, జైపూర్, గౌహతి, తిరువనంతపురం ఇలా భారత ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటు వ్యక్తులకు అధీనం చేయడం వల్ల భారతదేశంలో దళిత బహుజన యువకులకు ఉద్యోగ వసతి గగనకుసుమం అయింది. మోడీ పాలనలో వ్యవసాయరంగం అతి దారుణంగా దెబ్బతిన్నది. ఇది వ్యవసాయ ఉత్పత్తులు తగ్గడం మూలంగా కాదు. వ్యవసాయ ఉత్పత్తి ధరలు విపరీతంగా పడిపోవడం వల్లనే అన్నది యదార్థం. పండిన పంటకు గిరాకీ సరిగా ఉండకపోవడం ఒకవైపు, గిట్టుబాటుగాని మద్ధతు ధరలు మరోవైపూ, దీనితో పాటు ఆర్థిక సంస్కరణల్లో భాగంగా యూజర్ చార్జీలు పెరిగిపోవడం, అనేక వ్యవసాయ ఇన్‌పుట్లపై సబ్సీడీలు తగ్గించడం ఒకవైపు, ఉత్పత్తి ఖర్చు పెరిగిపోవడం మరోవైపు. ఫలితంగా వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయింది. రైతులు రుణగ్రస్తులయ్యారు. లక్షలాది మంది జీవన వ్యవస్థలు కుంటుపడ్డాయి గ్రామాల నుంచి వలస వెళ్ళిపోతున్నారు. ఈ సంక్షోభం నుండి రైతాంగాన్ని కాపాడటానికి బదులు వ్యవసాయ రంగం కార్పోరేటీకరణను ప్రోత్సహిస్తున్నది. ప్రపంచ వాణిజ్య (డబ్ల్యూ.టి.ఓ.) షరతులు కూడ మన దేశ రైతాంగానికి ప్రతికూలంగా ఉన్నాయి. బి.జె.పి. తన సంఖ్యా బలంతో పార్లమెంటును మతవాద భావజాలలకు వేదికగా మార్చింది. పార్లమెంటరీ కమిటీల పరిశీలనలు లాంటి పద్ధతులు పార్లమెంటరీ ప్రొసీజర్లు లేకుండానే చట్టాలు అత్యధిక చేయబడుతున్నాయి. ముఖ్యమైన చట్టాలు ఎలాంటి చర్చ లేకుండానే గందర గోళాల మధ్యనే పాసవుతున్నాయి. పార్లమెంటులో అంతర్గత నియంతృత్వం కొనసాగుతుంది. రాజ్యాంగం పార్లమెంటులో అనేకసార్లు ఉల్లంఘించబడుతుంది. పార్లమెంటు పట్ల తన జవాబుదారీ తనం నుండి మోడీ ప్రభుత్వం తప్పుకుంటున్నది. నూట పదకొండుమంది ఎస్.సి., ఎస్.ఎస్‌టి. ఎం.పి.లు పార్లమెంట్‌లో సామాజిక న్యాయాన్ని సాధించుటలో నిరంతరం విఫలం అవుతున్నారు. మహిళా ఎం.పి.ల హక్కుల పోరాట స్వరాలు ఆర్థనాదాలుగా మిగిలిపోతున్నాయి. ఆయా భాషా రాష్ట్రాల హక్కుల పోరాటాలను పార్లమెంటు వ్యవస్థలో విస్తరిస్తూ వెలుతుంది. మోడీ పాలనలోనూ అదే జరుగుతున్నది. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవహక్కులు, మొదలైన వాటన్నింటినీ వాగ్దానం చేస్తున్న భారత రాజ్యాంగం వర్ణ వివక్షతతో వ్యవహరిస్తుంది. పేదలకు భూమి పంపకం నిలిపివేసింది. గిరిజనుల భూముల రక్షణను నిరాకరిస్తుంది. ఆదివాసుల జీవన ప్రమాణాలు విద్యా వైద్య వసతులు నానాటికి కుంటుపడుతున్నాయి. రక్తలేమి స్త్రీల సంఖ్య పెరుగుతుంది. గర్భవతులకు, విధవరాండ్లకు సంరక్షణ లేదు. ఆర్థిక సామాజిక, రాజకీయ అంతరాలు పెంచివేయటానికి ఈ ప్రభుత్వం తోడ్పడింది. అతి కొద్ది మందిగా ఉన్న అత్యధిక సంపన్నులను ఒకవైపు, అత్యధికులైన అతి పేదలను మరొక వైపున నిలిపింది. ఈ విషయంగా మనం తప్పక బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను మననం చేసుకోవలసిన అవసరం ఉంది. సామాజిక అసమానతలు తొలగించే క్రమంలోనే ఆర్థిక అసమానతలు తొలగడమే గాక అంబేద్కర్ శ్రామికవర్గం హక్కులు, ప్రాతినిధ్యం, సాధికారతల గురించి కూడా చాలా వివరణాత్మకమైన వివరణలు 1943 సెప్టెంబర్ 6,7 తేదిల్లో కొత్త ఢిల్లీలో జరిగిన కార్మిక సమ్మేళనంలో ఇచ్చిన మహోపన్యాసం చాలా విశ్లేషణాత్మకమైంది. అందులోని చాలా అంశాల ఉల్లంఘన మనకు ఈనాడు దృశ్యీకృతం అవుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కింద అత్యధికుల అభీష్టం మేరకు శాసన విధానం, పాలనా విధానం ప్రస్తుత పరిస్థితిలో జరుగుతున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కింద ఎన్నికలలో అత్యధికులు దేశం యొక్క పరిశ్రమలలో సాంఘికత్వం, సంస్కృతి వైపుకు మొగ్గు చూపవచ్చు. తదుపరి వచ్చే ఎన్నికలలో అత్యధికులు దాని వ్యతిరేకతలు తెలుపవచ్చు. దేశ సాంఘికత్వానికి వ్యతిరేకతను అత్యధికులు వారి చట్టాలు రూపొందించగల శక్తిని ఉపయోగించవచ్చు. లేక దేశ సాంఘికత్వానికి అనుకూలంగా అత్యధికులు చేసిన దానిని చెరిపివేయవచ్చు. దేశ సాంఘికత్వానికి అనుకూలత దాని చట్ట రూపకల్పన శక్తిని ఉపయోగించి ఇది వరకు వారి వ్యతిరేకులు చేసిన దానిని మార్చవచ్చు. ఎవరైతే సంఘానికి ఆర్థిక నిర్మాణాన్ని, దేశ సాంఘికత ఆధారంగా రూపకల్పన చేయదల్చారో వారు ప్రాథమిక ఆవశ్యకతను విస్మరించకుండా పూర్తిచేయాలని గుర్తించుకోవాలి. అటువంటి సాధారణ న్యాయపరమైన అంశాలను ఒక సాధారణ ఆధిక్యతతో ఎవ్వరి రాజకీయ భవిష్యత్తు ఎప్పటికీ హేతుబద్ధమైన కారణాలతో నిర్ణయింపబడవో అట్టి వారికి చేయడానికి, చేయలేకపోవడానికి హక్కు ఉంది. ఈ విధమైన కారణాలతో రాజకీయ ప్రజాస్వామ్యం ఈ సాధనకు సరిపడదు. సంఘ ఆర్థిక నిర్మాణాన్ని రాజ్యాంగం నిర్దేశించాలన్న ప్రతిపాదనకు అనుకూలమైన ఈ విషయం నిర్వివాదాంశం, ఆర్థిక నిర్మాణం విధానం ఎలా ఉండాలన్నదే మిగిలి ఉన్న ప్రశ్న. ఇక్కడ మొత్తం ఈ మూడు విధానాల నుండి ఎంపిక చేయాలి. 1. పెట్టుబడిదారి విధానం, 2. సోషలిజం, 3.కమ్యూనిజం. శ్రామికుల ఎంపిక ఎలా ఉండాలి? శ్రామికులు పెట్టుబడిదారి విధానాన్ని ఎంపిక చేసుకోలేరు, ఆ విధంగా పెట్టుబడిదారి విధానాన్ని ఎంపిక చేసుకుంటే శ్రామికులు వారి స్వేచ్ఛను కోల్పోతారు. ఈ విధానంలో శ్రామికులకు ఒక వెసులుబాటుంది. అది వారి భవితవ్యానికి ముఖ్యమైన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ సంతోషాలు పొందడంలో ప్రజాస్వామ్య దేశాలు అవలంబించే ఒకే ఉపాయం ఏంటంటే ప్రభుత్వ అధికారాన్ని రాజకీయ రంగంలో తక్కువగా జోక్యం చేసుకోవడం. చాలా శక్తివంతమైన వ్యక్తుల ఆధిక్యతను అణచటానికి సాధారణ శాసనాధికారాన్ని మేల్కొల్పి, తక్కువ శక్తివంతమైన ఆర్థికరంగంపై అసంబద్ధమైన ఇబ్బందులను విధించకుండా ఉండడం. ఈ అంబేద్కర్ ఆలోచనలు రాను రాను భారతీయ సమాజాన్ని పునఃనిర్మించడానికి అత్యవసరం అవుతున్నాయి. ఆయన రాజ్యాంగ రచన ముందు, వెనుక అన్ని తరగతుల ప్రజల జీవన ప్రమాణాలను దర్శించారు. ఆయన ప్రధానంగా భావించిన విషయం భారతదేశానికి అనేక మతాలు వచ్చాయి, అనేక మతాలు ఇక్కడే ఆవిర్భవించాయి. అయితే ఏ మతాధిపత్యంలోకి భారతదేశం వెళ్ళకూడదు. భారతదేశం లౌకిక రాజ్యంగానే మనగలగాలి. భారతదేశంలో ప్రతీ పౌరుడు ఒకే సామాజిక, ఆర్థిక, రాజకీయ గౌరవాన్ని కలిగి ఉండాలి. అలా ఉన్నప్పుడే నేను రూపొందించిన రాజ్యాంగం అన్ని దిశలా ప్రతిఫలిస్తుంది. ముఖ్యంగా తరతరాలుగా అణచి వేయబడిన స్త్రీలు ఆత్మగౌరవంతో, ఆత్మస్థైర్యంతో, ఆర్థిక ప్రతిపత్తితో స్వావలంబనతో జీవించే పరిస్థితులు రావాలి. ఎందుకంటే భారతదేశంలో ఇప్పటికీ స్త్రీలు అవమానించబడుతున్నారు. అణగద్రొక్కబడుతున్నారు. ఆత్మన్యూనతకు గురి చేయబడుతున్నారు. గృహహింసకు బలవుతున్నారు. ఇంకా మన సమాజం పితృస్వామిక ఆధిపత్యం లోనే ఉంది. స్త్రీ విముక్తి రాజ్యాంగ సూత్రాల ఆచరణ నుండే లభిస్తుంది. 1946లో రాజ్యాంగ పరిషత్ డిసెంబర్ 9న తొలిసారిగా సమావేశం అయ్యింది. 1947 ఆగష్టు 15న అది స్వతంత్ర భారత సర్వసత్తాక రాజ్యాంగ పరిషత్ అయ్యింది. 1948 నవంబర్ 4న రాజ్యాంగ ముసాయిదా అంబేద్కర్ సమర్పించారు. 1949 నవంబర్ 26న తుది రాజ్యాంగాన్ని ఆమోదించారు. డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా డా॥బి.ఆర్.అంబేద్కర్ దీనిని సమర్పించారు. 1947 ఆగష్టు 15 నుంచి 1950 జనవరి 26 మధ్య అవసరమైన మార్పులు చేయబడ్డాయి. డా॥బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పన కృషిలో తన ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టారు. అందుకే ఆయన భారత దేశంలోని ప్రజలందరు ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సాంకేతిక రంగాలన్నింటిలో సమానతను సాధించుకోవడమే ఈ రాజ్యాగం యొక్క లక్ష్యమని ప్రకటించారు. ఆ మార్గంలో నడుద్దాం......

**డాక్టర్. కత్తి పద్మారావు**
**దళిత ఉద్యమ నేత**
**9849741695**

## 26న పోల్కంపల్లి గ్రామంలో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాక



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 24 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో 26 తారీఖున జరగబోయే హాత్ సే హా త్ జోడో పాదయాత్ర కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ యంగ్ డైనమిక్ లీడర్ పార్లమెంటు సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాత్ సే హాత్ జోడో కార్యక్రమానికి రానున్నారు. పోల్కంపల్లి గ్రామ ప్రజలంతా స్వాగతం పలకవలసిందిగా కోమటిరెడ్డి యువసేన నాయకులు కంబాలపల్లి బాలరాజ్ ( బాలు) ప్రజలను కోరారు. ఈరోజు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న తీరు ప్రజలకు తెలుపడం కోసం ఒకపక్క కేంద్ర ప్రభుత్వం గ్యాస్ డీజిల్ రేట్లు పెంచి పేద ప్రజల నడ్డి విడుస్తున్నాయని మరోపక్క తెలంగాణ రాష్ట్రంలో డబల్ బెడ్ రూమ్ లో ఇస్తామని చెప్పి పేద ప్రజలకు అందివ్వలేని పరిస్థితి బీఆర్ఎస్ పార్టీదాని ఆయన తెలిపారు. అకాల వర్షం కురిపించిన వడగండ్ల వానతో రైతులు కు నష్టపరిహారం లేక గోసరిల్లుతున్నారని ప్రభుత్వం మీద మండిపడ్డారు. ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్న రేషన్ కార్డు లేక ఎంతో మంది ప్రజలకు రేషన్ సరుకులు అందలేక అల్లాడిపోతున్నారని ఇలాంటి సమస్యల పైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి మర్రి నిరంజన్ రెడ్డి ప్రభుత్వాన్ని నిగ్గదీశే విధంగా హాత్ సే హాత్ జోడో యాత్ర ఉంటుందని ఆయన తెలిపారు.

## వడ్డెర సంఘం జెండా ఆవిష్కరించిన ఎం ఎల్ ఏ మెచ్చా నాగేశ్వరరావు



అశ్వారావుపేట, మార్చి 24 ప్రజాపాలన ప్రతి నిధి: అశ్వారావుపేట మండలం వినాయకపురంగ్రామం లో తెలంగాణ వడ్డెర సంఘం అధ్యక్షులు మరియు చైర్మన్ శివరాత్రి ఇలుమల్లు మరియు జిల్లా అధ్యక్షులు తేవర్ల దుర్గారావు పిలుపుమేరకు అశ్వారావుపేట నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డెర సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశ్వారావుపేట ఎం ఎల్ ఏ మెచ్చా నాగేశ్వరరావు హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారికి సంఘం ఆడపడుచులు ఘన స్వాగతం పలికారు.జెండా ఆవిష్కరణ అనంతరం ఎం ఎల్ ఏ ను సంఘం పెద్దలు శాలువాతో సత్కరించారు.అలాగే అశ్వారావుపేట లో కమ్యూనిటీ హాల్ అవసరం ఉందని, అంగణవాడి కేంద్రం మరియు వడ్డెర సంఘం వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.ప్రతి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని ఎం ఎల్ ఏ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపీ పి జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి,మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండి పుల్లారావు,,మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జుజ్జూరి వెంకన్న బాబు,మోహన్ రెడ్డి,వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు మరియు చంద్రుగొండ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పతల ఏడుకొండలు, బీర్రం వెంకటేశ్వరరావు,తుంపటి రమేష్,గ్రామ కమిటీ అధ్యక్షులు మురళి, కసాని చంద్ర మోహన్, దెరంగుల శ్రీను, మొటురి మోహన్, కలపాల శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## అరుదుగా వచ్చే మొయా వ్యాధికి టిఎక్స్ హాస్పిటల్లో చికిత్స



మేడిపల్లి, మార్చి 24 (ప్రజాపాలన ప్రతినిధి) :ఆరు నెలలుగా మొయా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ముప్పై నాలుగు సంవత్సరాల యువతికి టిఎక్స్ హాస్పిటల్ వారి వైద్య బృందం విజయవంతంగా శస్త్ర చికిత్స చేసి మళ్ళీ మామూలు మనిషిని చేసారు. ప్రధానంగా ఈ వ్యాధి బారిన పడినవాళ్ళకి తరుచుగా మూర్ఛ రావడం, మెదడులో ఓ వైపు రక్త ప్రసరణ తగ్గి శరీరం ఎడమ భాగం లేదా కుడి బాగంలో నీర్సంగా ఉండటం లాంటివి జరుగుతాయి. వంశపార్యపరంగా సంక్రమించే ఈ జబ్బుని హైదరాబాద్లోనే అతి తక్కువ హాస్పిటల్స్ లో మాత్రమే అందు బాటులో ఉండే డైరెక్ట్ వ్యాస్కులర్ అనస్టోమోసిస్ (ఎస్.టి.ఏ-ఎమ్.సి.ఏ బైపాస్) అనే క్లిష్టమైన ప్రక్రియ ద్వారా నయం చేయడం జరుగుతుంది. హాస్పిటల్లో చేరిన ఐదురోజు తర్వాత, అంటే సరిగ్గా ఈ నెల పదహారున డిస్చార్జ్ అయిన పేషెంట్ ఇంక తన రోజు వారి కార్యక్రమాలని ఏ ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చని ఈ ఆపరేషన్ చేసిన బ్రెయిన్ అండ్ స్పైన్ సర్జన్ దా. నరేష్ కుమార్ గజ్జల (గోల్డ్ మెడలిస్ట్), డా. ఏ. రాజేష్, అనెస్తీషియస్ట్ డా. అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఇంతటి క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా టిఎక్స్ హాస్పిటల్ చెయ్యడం వల్ల ఈ వ్యాధి బారినపడి ఇబ్బంది పడుతున్న వారికి చికిత్స ఉందని ధైర్యాన్ని ఇచ్చిన వాళ్ళం అవ్వగలిగాం అని ఛీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ డా. శ్రీకాంత్ వొడ్నాల, డా. అస్నా, కిషోర్ కుమార్ అలానే డైరెక్టర్స్ డా. కీర్తికర్ రెడ్డి, డా. దీపక్ రాజు, మిస్టర్. రవీంద్రా రెడ్డి పత్రికా ముఖంగా తెలిపారు.

# పరువు నష్టం దావా కేసులో రాహుల్ గాంధీకి జైలు శిక్ష వేయడాన్ని ఉపసంహరించాలి



అశ్వారావుపేట ప్రజాపాలన( ప్రతి నిధి) అశ్వారావుపేట లో తెలంగాణ పిసిసి సభ్యులు జ్యేష్ట సత్యనారాయణ చౌదరి అశ్వారావుపేట లోని తన స్వగృహంలో కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యేష్ట సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాజకీయాలు పరాకాష్టకు చేరుకుంటున్నాయని, అన్ని వ్యవస్థల మీద అజమాయిషీ చేస్తూ న్యాయ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, పరువు నష్టం దావా కేసులో రాజీవ్ గాంధీకి జైలు శిక్ష విధించడం వెనుక రాజకీయ కుట్ర దాగుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దీర్ఘకాలికంగా పరిపాలన కొనసాగించినప్పటికీ, అందరిని సమన్వయం చేసుకుంటూ సుపరిపాలన అందించారని, ఇటువంటి రాజకీయ కుట్రలు ఏనాడు చేయలేదని, ఇటువంటి కేసులలో జైలు శిక్ష వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని, ఇటువంటి కేసులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విధంగా నిర్బంధం కొనసాగితే ఏ ఒక్క బీజేపీ కార్యకర్త కూడా రోడ్డు మీద స్వేచ్ఛగా తిరగలేరన్నారు. కాంగ్రెస్ పార్టీ మహాసముద్రం లాంటిదని బిజెపి ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు అన్ని గమనిస్తున్నారని, భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదేనని వారు దీమా వ్యక్తం చేశారు.

'వైరాలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయండి'

కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర చేసిన సందర్భంగా రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లేందుకు ఈనెల 26వ తేదీన మాజీ కేంద్రమంత్రి రేణుకా చౌదరి అధ్యక్షతన ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేసిన భారీ ర్యాలీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ విది విధానాలను, రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని వారు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మాణిక్ రావు కాగ్రే, ఏఐసీసీ కార్యదర్సులు రోహిత్ చౌదరి, నవీన్ జావేద్ హాజరవుతారన్నారు.

**నష్టపోయిన రైతాంగానికి పదివేలు ప్రకటించడం హాస్యాస్పదం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నష్టపోయిన రైతాంగానికి పదివేలు నుండి పదిహేను వేలు సాయం అందించారని, అప్పటి ధరలకు ఇప్పుడు ధరలు పోల్చుకుంటే అనేక రెట్లు ధరలు పెరిగాయని, స్వయంగా ముఖ్యమంత్రి వచ్చి పంటలు పరిశీలన చేసి పదివేలు ప్రకటించడం విడ్డూరంగా ఉందని రైతులు పెదవి విరుస్తున్నారన్నారు. చేతికి వచ్చే పంట నష్టం అయితే రైతుకు ఎంత నష్టమో కనీసం అంచనా వేయకుండా చుట్టపు చూపుగా వచ్చి, రేపు ఓట్లు దండుకోవచ్చు అనే ఉద్దేశంతో పదివేలు ప్రకటించి చేతులు దులువుకున్నారన్నారు. తెలంగాణలో టిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి దొందు దొందేనని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని వారు కార్యకర్తలకు సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో పిసిసి సభ్యులు జేష్ట సత్యనారాయణ చౌదరి, సొసైటీ డైరెక్టర్ బత్తిని పార్ధసారథి, అనంతారం సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, కాంగ్రెస్ నాయకులు బండారి శ్రీనివాసరావు, మేక అమర్నాథ్, చిమడబోయిన సత్యనారాయణ, మొగిలి రాంబాబు, ఆకిరిపల్లి రాంబాబు, దొడ్డాకుల రమణ, అనిల్ కృష్ణ, తమ్మిశెట్టి పోషయ్య, గండేటి సీతారాం, వార్డు మెంబర్లు కాంద్రుకోట ఉదయ్ కుమార్, హలవత్ లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయమిత్ర ద్వారా పౌష్టికాహార కిట్లని అందజేసిన ఎంపీపీ జల్లిపల్లి



అశ్వారావుపేట ప్రజా పాలన (ప్రతినిధి) అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామపంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాల నందు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా క్షయమిత్ర పౌష్టికాహార కీట్లను అందజేసిన అశ్వారావుపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ జల్లిపల్లి.శ్రీరామమూర్తి. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ప్రతి ఒక్క ప్రభుత్వ వైద్యశాల నందు వైద్యానికి కావలసిన అన్ని రకాల వసతులను వైద్య పరికరాలను అలాగే డాక్టర్స్ ను పూర్తి స్థాయిలో నియమిస్తున్నారని, అలాగే విద్యార్థులకు కూడా బలానికి, రోగ నిరోధక శక్తికి జ్ఞాపక శక్తిని పెంచడానికి న్యూట్రిషన్ కిట్లను అందజేయడం జరిగిందని, అలాగే ఈ రోజు క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా వినాయక పురం గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల లో ఈ రోజు 45 ఈ పౌష్టికాహార కిట్లను అందజేయడం జరుగుతుందని ఈ కిట్లాల లో 6 రకాల ఆహార పదార్థాలు ఉన్నాయని బెల్లం,పల్లీలు,గోధుమపిండి, కందిపప్పు, రాగి పిండి పలు రకాల ఆహార పదార్ధాలు ఉన్నాయని వీటి వల్ల,మనం క్రమం తప్పకుండా ఈ ఆరోగ్య కరమైన పదార్థాలు తీసుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటే టి.బి పూర్తిగా జయించగలమని,అలాగే ఈ కిట్లలో అందించే ఆహార పదార్థాల వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, అలాగే రక్తం,శుద్ధి పడి పలు అనారోగ్య సమస్యకు దూరం అవుతాయని కావున ఈ కొట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరిన అశ్వారావుపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండి పుల్లారావు,మండల నాయకులు మోహన్ రెడ్డి, ఎంపిటిసి మారుతి లలిత, టెలికాం అడ్వైజర్ నెంబర్ బిర్రం వెంకటేశ్వరరావు,డాక్టర్ రాందాస్,శ్రీనివాస్, గంథం వేంకటేశ్వర రావు హాస్పిటల్ సిబ్బంది, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ జాతీయ స్థాయి పంచాయతీ అవార్డు అందుకున్న పలువురు సర్పంచ్ లు, కార్యదర్శులు







బోనకల్, మార్చి 24 ప్రజా పాలన ప్రతినిధి:నేషనల్ గ్రామ పంచాయతీ అవార్డు లో బాగంగా క్లీన్ అండ్ గ్రీన్ నేషనల్ పంచాయతీ అవార్డులను శుక్రవారం పలువురు సర్పంచులు, కార్యదర్శులు అందుకున్నారు. మండలంలో 22 గ్రామపంచాయతీలో ఉండగా 17 గ్రామ పంచాయతీలు నేషనల్ గ్రామపంచాయతీ ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన సర్పంచులు మర్రి తిరుపతిరావు (ఆళ్ళపాడు), కొమ్మినేని ఉపేందర్ (రావినూతల), యంగల దయామణి ( కలకోట), ములకారపు రవి (చిరునోముల), మందడపు తిరుమలరావు (రాపల్లి), పంచాయతీ కార్యదర్శులు బానోత్ శివుడు, (లక్ష్మీపురం), బంధం అర్జున్ (చిరునోమల) లకు అవార్డులను ఎంపీపీ కంకణాల సౌభాగ్యం ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు ములకారపు రవి, ఉమ్మనేని బాబు, యంగళ దయామని, మర్రి తిరుపతిరావు, కొమ్మినేని ఉపేందర్ ,భూక్యా సైదా నాయక్, ఆళ్ల పుల్లమ్మ ,నోముల వెంకట నరసమ్మ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జమాలుద్దీన్,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బంధం అర్జున్, దామల్ల కిరణ్, బుద్దుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు



చేవెళ్ల మార్చి 24,( ప్రజాపాలన):జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవంలో చేవెళ్ల మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు రావడం సంతోషంగా ఉందని చేవెళ్ల ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, జడ్పిటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉత్తమ గ్రామపంచాయతీలకు అవార్డులను ఎంపీపీ,జడ్పిటిసిల చేతుల మీదుగా అందజేశారు. గ్రామ సర్పంచ్లను పంచాయతీ కార్యదర్శులను ఎంపీటీసీలను సన్మానించారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు,పల్లె ప్రకృతి వనాలు,గ్రామాల పరిశుభ్రత,రైతు వేడుకలు,ఇంటింటికి నల్ల,వాడవాడల్లో సిసి రోడ్లు,వేస్తూ అన్ని రకాలుగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాయని అన్నారు.అవార్డులు అందుకున్న గ్రామ పంచాయతీలు మరింత బాధ్యతయుతంగా పని చేయాలని ప్రజలకు సేవచేయడమే లక్ష్యంగా చేసుకుని పని చేయాలని పంచాయతీ అభివృద్ధిలో అందరిని భాగస్వాములను చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సర్పంచ్లు ఎంపిటిసిలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ మహాసభల పోస్టర్ విడుదల



మంచిర్యాల టౌన్, మార్చి 24, ప్రజాపాలన:ఏప్రిల్ 12వ తేదీన జరిగే క్రైస్తవ మహాసభల పోస్టర్ ను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు చేతుల మీదుగా శుక్రవారం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవ. ఆర్ ఐసయ్య మాట్లాడుతూ హైదరాబాద్లో జరిగే మహాసభలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవ మిత్రులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ విడుదల చేసినందుకు గాను ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ కార్యదర్శి పాస్టర్ సామ్యేలు, కోశాధికారి జునియా కన్నూరి, సభ్యులు సుధాకర్, సామ్మేలు, మహేందర్, ప్రభుదాస్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నివేదన యాత్ర ముగింపు బహిరంగ సభకు పెద్ద ఎత్తున యువత తరలిరావాలి: నర్సగళ్ల ప్రవీణ్



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 24 ప్రజాపాలన ప్రతినిధిప్రగతి నివేదన యాత్ర మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ప్రజల వద్ద పాలనకు చేరుకున్న సందర్భంగా 64 రోజులు,800 96 గ్రామాలు తిరిగి విజయవంతం చేశారు అని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్వి ఉపాధ్యక్షులు నర్సాగళ్ల ప్రవీణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రగతి నివేదన పాదయాత్ర ముగింపు సభకు యువత భారీ ఎత్తున తరలి రావాలి బహిరంగ సభ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు గురించి తెలపడం కోసం మంత్రి కేటీఆర్ రానున్నారని పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం కంకణం బద్ధులై నడవాలని పెద్ద అంబర్పేట్ లో జరిగే బహిరంగ సభకు దహితుల హాజరై విజయవంతం చేయాలని ప్రవీణ్ తెలిపారు.

## విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



మంచిర్యాల టౌన్, మార్చి 24, ప్రజాపాలన : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మదిన తుల్ ఉలూమ్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థినులకు జనయేత్రి ఫౌండేషన్ సహకారంతో మైనారిటీ హక్కుల పరిరక్షణ ఫ్రంట్ సౌజన్యంతో విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎఫ్. సంస్థ గౌరవ అధ్యక్షులు విశ్రాంత జిల్లా పరిషత్ సి.ఈ.ఓ. ముహమ్మద్ ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షులు ముహమ్మద్ షబ్బీర్ పాషా, సలహాదారు ముహమ్మద్ యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ పంచాయతీ అవార్డుల్లో సత్తా చాటిన దెందుకూరు గ్రామ పంచాయితీ



మధిర మార్చి 24 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో దెందుకూరు గ్రామపంచాయతీ కి నేషనల్ పంచాయతీ అవార్డులో సర్పంచ్ పలువురు ఆదర్శంగా తీసుకుంటున్న గ్రామ సర్పంచ్ వారి ఆధ్వర్యంలో అనేక వార్డులు గ్రామ అభివృద్ధి తోడ్పడు నేషనల్ పంచాయతీ అవార్డు గ్రహీతగా పొందిన గ్రామ సర్పంచ్ కోట విజయశాంతి కృష్ణ కు దెందుకూరు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు అనంతరం సర్పంచ్ ఆమె మాట్లాడుతూ ఈ గ్రామంలోవార్డు సభ్యుల,గ్రామ ప్రజల సహకారం వల్లే ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డు నాపై మరింత బాధ్యత పెంచింది. దెందుకూరు గ్రామ సర్పంచ్ కోట విజయశాంతి వెంకటకృష్ణ మండలంలో అత్యధిక విభాగాలలో అభివృద్ధిని కనబర్చిన దెందుకూరు గ్రామానికి దిన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ వికాస్ అవార్డు లభించింది. ఈ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ అవార్డు తమ వార్డు సభ్యుల, గ్రామ ప్రజల సహకారంతో లభించిందనిఈఅవార్డు రావడంతో మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. తమకు సహకరించినగ్రామ సెక్రెటరీకి గ్రామస్థాయి అధికారులకు పంచాయతీ సిబ్బందికి . గ్రామలిప్రజలకుఉపలిసర్పంచ్ వారికి వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని మరింతఅభివృద్ధిచేస్తామని వారుతెలిపారు.

## జాతీయ పంచాయతీ అవార్డుకు ఎంపికైన ఎర్రుపాలెం గ్రామపంచాయతీ



ఎర్రుపాలెం మార్చ్ 24 శుక్రవారం ప్రజా పాలన ప్రతినిధి జాతీయ పంచాయతీ అవార్డులో భాగంగా ఎరుపాలెం గ్రామపంచాయతీ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం మనీ మండల్ ఎంపీపీ శ్రీమతి దేవరకొండ శిరీష ఆనందని వ్యక్తపరిచారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీమతి శిరీష ,ఎంపీడీవో శ్రీనివాసరావు ,స్థానిక సర్పంచ్ మొగిలి అప్పారావు ,ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలి ,సెక్రెటరీ నాగేశ్వరావును. ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాలకవర్గం పాల్గొన్నారు.

## చిన్నారులకు వినూత్న విద్యాభ్యాసానికి శ్రీకారం ఎజైల్ శాల : ఎజైల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పూర్ణిమ



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): చిన్నారుల్లో వినూత్న విద్యకు శ్రీకారం చుడుతూ పిల్లల్లో స్వతహాగ ప్రశ్నించే తత్త్వం పెంపొందే విధంగా నూతన తరహా విద్యాభ్యాసానికి భారత దేశం లో మొట్టమొదటి సారిగా అంకురార్పణ చేస్తూ తమ ఎజైల్ శాల స్కూల్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ వి. పూర్ణిమ. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్కూల్ చిన్నారులు, సిబ్బంది తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వర్చువల్ విధానంలో ఈ స్కూల్ లో ప్రస్తుతం విద్యాభ్యాసం చేస్తున్నారని, త్వరలో క్యాంపస్ ఏర్పాటు చేసి ఫిజికల్ క్లాస్ లు కూడా ప్రారంభిస్తున్నామన్నారు. నేడు కొనసాగుతున్న విద్యాబోధనలాగా కాకుండా పిల్లల్లో ప్రశ్నించే విధానం పెరిగేలాగా తాము విద్యార్థులకు పూర్తి స్వాతంత్ర్యం ఇస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిలబస్ లనే నూతన తరహాలో బోధించునున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు చురుకుగా తమతోటి విద్యార్థులతో మెలిగేలా క్యాంపస్ లు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె తో పాటు స్కూల్ సిబ్బంది శ్రీకర, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పంచాయతీ అవార్డు దామరగిద్ద



చేవెళ్ల :(ప్రజాపాలన) చేవెళ్ల మండల కేంద్రంలో శుక్రవారం నాడు జాతీయ పంచాయతీ అవార్డు ప్రధానోత్సవంలో భాగంగా చేవెళ్ల మండల్ పరిషత్ కార్యాలయంలో దామరగిద్ద సర్పంచ్ వెంకటేశం గుప్తా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు ను అందుకున్నారు. చేవెళ్ల జెడ్పిటిసి సభ్యురాలు మాలతి రెడ్డి చేతుల మీదగా అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి. వైస్ ఎంపీపీ కర్నే శివప్రసాద్. చేవెళ్ల ఎంపీడీవోతదితరులు పాల్గొన్నారు.

## 26న హాత్ సే హాత్ జోడో పోల్కంపల్లి పాదయాత్ర కు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి రాక



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 25 ప్రజాపాలన ప్రతినిధి :టిపిసిసి సభ్యులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర లో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పోల్కంపల్లి గ్రామంలో 26/03/2023 ఆదివారం రోజున ఉదయం 9 గంటలకు హాత్ సే హాత్ జోడో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ సభ్యులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెనర్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. విచ్చేయుచున్నారు కావున నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఎమ్మెన్నార్ యువసేన టీం సభ్యులు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా మర్రి నిరంజన్ రెడ్డి పార్టీ ముఖ్యులను కోరారు, ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు, రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలందరి సమస్యలు పరిష్కరిస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం పార్టీ మాజీ అధ్యక్షుడు కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ఏ బ్లాక్ ప్రసిడెంట్ శంకర్ గౌడ్, నాయకులు జంగారెడ్డి, రజనీకాంత్ గౌడ్, రామ్ రెడ్డి, ఉదయపాల్ రెడ్డి,బుపతి గళ్ళ రాజు, మైపాల్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, ఎమ్మెన్నా యువసేన ప్రెసిడెంట్ కమలాకర్ రెడ్డి, మనోజ్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు చరణ్ ముదిరాజ్,మహేష్ గౌడ్,ధనరాజ్,రమేష్ రాథోడ్, ఆర్కె ప్రవీణ్, సర్పంచులు ,ఎంపీటీసీలు, ఉపసర్పంచ్ లు, పిఎసిఎస్ డైరెక్టర్లు, పాల్గొన్నారు. పోల్కంపల్లి గ్రామ ముఖ్య నాయకులు పల్సం అబ్బాయ్య,అశోక్ గౌడ్,వెంకటేష్ గౌడ్,జంగయ్య,శ్రీనివాస్, అశోక్,శివ ప్రసాద్, శ్రీను,విక్రమ్,తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొండ్రు ప్రవీణ్ కుమార్



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 24 ప్రజాపాలన ప్రతినిధి: శుక్రవారం రోజున ఇబ్రహీంపట్నం నుండి నిరుద్యోగ నిరసన దీక్షకు గౌరవనీయులు తెలంగాణ పిసిసి అధ్యక్షులు శ్రీ రేవంత్ రెడ్డి గారి తో కలిసి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహిస్తున్నటువంటి ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ దీక్షకు బయలుదేరడానికి వెళుతున్నటువంటి ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కొండ్రు ప్రవీణ్ కుమార్ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యదర్శి సొప్పరి రవికుమార్ కంటెస్టెడ్ కౌన్సిలర్ జమాల్పూర శ్యామ్లాల్ యూత్ కాంగ్రెస్ నాయకులు ముదుపు సాయి తేజ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక్క జంగారెడ్డి నీ అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది ఈ కార్యక్రమంలో కొండు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డ తర్వాత మా బతుకులు బాగుంటాయని నమ్మినటువంటి తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థులు అకారణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తుంటే ఉద్యోగాలు రాకుండా అనేక మంది విద్యార్థులు నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడతా ఉంటే వారికి అండగా నిలబడడానికి తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొండ్రు ప్రవీణ్ కుమార్ ఈరోజు ఇబ్రహీంపట్నం నుండి నిరుద్యోగ నిరసన దీక్షకు గౌరవనీయులు తెలంగాణ పిసిసి అధ్యక్షులు శ్రీ రేవంత్ రెడ్డి తో కలిసి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహిస్తున్నటువంటి ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ దీక్షకు బయలుదేరడానికి వెళుతున్నటువంటి ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కొండ్రు ప్రవీణ్ కుమార్ లిఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యదర్శి సొప్పరి రవికుమార్ కంటెస్టెడ్ కౌన్సిలర్ జమాల్ పూర్ శ్యామ్ లాల్ యూత్ కాంగ్రెస్ నాయకులు మదుపు సాయి తేజ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొక్క జంగారెడ్డి నీ అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది ఈ కార్యక్రమంలో కొండు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డ తర్వాత మా బతుకులు బాగుంటాయని నమ్మినటువంటి తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థులు అకారణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తుంటే ఉద్యోగాలు రాకుండా అనేక మంది విద్యార్థులు నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడతా ఉంటే వారికి అండగా నిలబడడానికి తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ని గృహనిర్బంధం చేయడానికి జావా తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తోంది భవిష్యత్తులో నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్న వారి కండగా నిలబడి కొట్లాడుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ని గృహనిర్బంధం చేయడానికి తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండిస్తోంది. భవిష్యత్తులో నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్న వారికి అండగా నిలబడి కొట్లాడుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కరీంనగర్ జిల్లాలో అభివృద్ధిలో మూడవ స్థానం మెట్పల్లి పిఏసిఎస్



శంకరపట్నం ప్రజాపాలన మార్చి 24:శంకరపట్నం మండల పరిధిలోని మెట్పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) అర్ధవార్షిక మహాసభ సంఘం చైర్మన్ ప్రొద్దుటూరు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కన్నాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ మహాసభలో సంఘం బ్యాంకులో డిపాజిట్లు, ఋణాలు, పొదుపులు, వ్యయ ఆదాయాలపై చర్చ జరిపారు. పలువురు రైతులు పంట ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు విక్రయించబోతే తరుగు పేరుతో 5 కిలోల మేర కోత కోస్తున్నారని వాపోయారు. రైతుల ఆరోపణ మేరకు సభలో సంఘం తీర్మానం చేసింది. అనంతరం చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో మెట్పల్లి సంఘం నూతన కరీంనగర్ జిల్లాలో మూడవ స్థానంలో నిలిచిందని అన్నారు. సహకార సంఘం బ్యాంకులో ఫిక్స్ డ్ డిపాజిట్ లపై 36 నెలలకి 7.50% వడ్డీ అందిస్తున్నదని తెలిపారు. సంఘంలోని నాలుగు ఎకరాలకు పైగా కలిగిన రైతులకు ఆర్థిక సహాయం ఫెర్టిలైజర్స్ అందజేస్తున్నామని, చేతికందాక పంట రుణంతోపాటు ఫెర్టిలైజర్స్ రుణం కూడా చెల్లించాలన్నారు. అదేవిధంగా మెట్పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కన్నాపూర్ లో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు భూసేకరణ జరుగుతున్నదని తెలిపారు. సంఘం ప్రైవేటు వ్యాపారుల కన్నా తక్కువ ధరలకు ఎరువుల బస్తాలను అందజేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నాపూర్ ఎంపీటీసీ మోతే భాగ్యలక్ష్మి ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ అంతం రవీందర్ రెడ్డి, సభ్యులు భోనగిరి ఐలయ్య, బుచ్చిరెడ్డి, వెంకట రమణారెడ్డి, బత్తుల రవి, కవ్వ పద్మ, బోడ సుధాకర్, రాజిరెడ్డి సీఈవో సదానందం, రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం కోసం తన వంతుగా లక్ష రూపాయలు అందించిన జెడ్పిటిసి అవినాష్ రెడ్డి



షాబాద్: ప్రజాపాలన ప్రతినిధి: అంబేద్కర్ యువజన సంఘాల చైతన్యం కోసం తన వంతుగా పూర్తి సహకారంలి అందిస్తానని షాబాద్ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి అన్నారు సీతారాంపురం గ్రామంలో ఏర్పాటు చేస్తున్నఅంబేద్కర్ విగ్రహం కోసం తన వంతుగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశంలో అసమానతలు తగ్గించి సమ సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం తపించిన అంబేద్కర్ ఆశయాలను సాధించవలసిన అవసరం ఉందని అన్నారు. అందుకుగాను ప్రజా చైతన్యం ఎంతో అవసరం అని చెప్పారు. అంబేద్కర్ ఆశించిన విధంగా అందరూ విద్యావంతులై, అభివృద్ధి ఫలాలను ఆస్వాదించినప్పుడే భారత దేశంలో నవ సమాజం ఏర్పడుతుందని, అందుకోసం అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని చెప్పారు. సర్పంచ్ పాండురంగ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్, చింటెట్టి మణి, నర్సింహ్మా చారి మంగళ రాజు, మహేందర్, రవి, ముదంగల బుగ్గరాములు, పోతురాజు యాదయ్య, తోపుగొండ నర్సిములు, భరత్, భాస్కర్, గోవుల బుగ్గ రాములు, వంశి, చిన్నయ్య, రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణ కమిటి సన్నాహక సమావేశం




శంకరపట్నం మార్చి 24 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మానం కోసం కేశవపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 95-96 పదవతరగతి పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో శుక్రవారం పునర్నిర్మాణ కమిటీనీ ఎన్నుకోవడానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పుర ప్రముఖులు హాజరయ్యారు. ఈనెల 25న పూర్తిస్థాయి కమిటీ వేయనునట్లు వారు పేర్కొన్నారు. మహిళలు భక్తి పాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవం



ఎర్రుపాలెం మార్చి 24 ప్రజా పాలన ప్రతినిధి ఎర్రుపాలెం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యాలయం మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో గ్రామపంచాయతీ ఏర్పాటు చేసుకోవడం చాలా అభినందనీయమని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో మండలఎంపీపీ దేవరకొండ శిరీష , ఎర్రుపాలెంగ్రామ సర్పంచ్ మొగిలి. అప్పారావు, మండల అధ్యక్షులు పంబి. సాంబశివరావు, ఎంపీటీసీ సకుర్తి కిషోర్ బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎమ్మార్వో తిరుమల చారి ,జెడ్పిటిసి కవిత ,ఎంపీ ఓ శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచులు సొసైటీ చైర్మన్ పంచాయతీ కార్యవర్గ సభ్యులు లక్ష్మీపురం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన గుర్రం రామారావును అభినందించిన బిఆర్ఎస్ నాయకులు



మధిర రూరల్ మార్చి 24 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు చొరవతో మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్గా ఎన్నికై ఈరోజు బాధ్యతలు చేపట్టిన గుర్రం రామారావును సన్మానించి అభినందించిన బిఆర్ఎస్ నాయకులు. ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు ను డైరెక్టర్లను అభినందించిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, రైతుబంధు కన్వీనర్ చావా వేణు బాబు, కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ కోన నరేందర్ రెడ్డి,మొండెం వెంకన్న, తదితరులు ఉన్నారు.

## పల్లె నిద్రలో సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే సంజయ్ కుమార్



బీరుపూర్, మార్చి 24 (ప్రజపాలన ప్రతినిధి):బీరుపూర్ మండల్ తుంగూరు గ్రామంలో మీరునేను పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శుక్రవారం రోజున ఉదయం ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ వార్డులను పర్యటించి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలిస్తూ గ్రామంలో ప్రజల సమస్యలను వింటూ అధికారులతో పరిష్కరిస్తూ గ్రామంలోని ప్రజలతో కుల సంఘాలు మహిళలు యువకులతో కలిసి మీరునేను కారేక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని చిన్న చిన్న సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించి ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఎమ్మెల్యే ఇచ్చారు. ఈకారేక్రమంలో తహశీల్దార్ శ్రీలత ఎంపీవో రాజు కెడిసిసి జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావు జిల్లా రైతు బందు సమితి సభ్యుడు కోలుముల రమణ మండల పార్టీ అధ్యక్షులు నారపాక రమేష్ ముక్క శంకర్ ముక్క వెంకటేష్ రామక్రీష్టు గంగాధర్ మహిపాల్ రెడ్డి రామచంద్రం గౌడ్ అజిత్ రావు దోసరపు బుచ్చన్న జలపతి చుక్క రమేష్ కిషన్ గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

## భాద్యులపై చర్యలు తీసుకోవాలి: సర్పంచ్ సిపతి రమేష్



బీరుపూర్, మార్చి 24 (ప్రజపాలన ప్రతినిధి): మార్చి 23 గురువారం రోజున ధర్మపురి మండలంలోని ఆరేపల్లి గ్రామనికి చెందిన కొందరు వ్యక్తులు కుంబాల రమేష్ గంగదరి కిష్టయ్య అనే ఇద్దరి ఆధ్వర్యంలో దాదాపు 60 మంది యువకులను తీసుకొని బీర్పూర్ మండలంలోని కోమన్ పల్లి అనుబంధ గ్రామమైన డొంకేశ్వరం శివారులోని సర్వే నెంబర్103 లో 2 ఎకరాల 30 గుంటలు మరియు 108 సర్వే నెంబర్ 2 ఎకరాల 27 గుంటల భూమిని కబ్జా చేశారని డొంకేశ్వరం గ్రామ ప్రజలు గత ముప్పై సంవత్సరాలుగా పెంచుతున్న టేకు చెట్లను నరికి తీసుకెళ్తు గొడవకు దిగారు. అడ్డుకోబోయిన డొంకేశ్వరం గ్రామస్థులకు ఆయుధాలను చూపిస్తూ భయ బ్రాంతులకు గురి చేశారని కోమన్ పల్లి సర్పంచ్ సిపతి రమేష్ గ్రామ ప్రజలు బీర్పూర్ తహసీల్దార్ శ్రీలతకు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశామని సర్పంచ్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి ఘటనకు బాద్యులైన వారిపై చట్టపరమైన చర్యలకు అధికారులను ఆదేశించాల్సిందిగా ఎమ్మెల్యేను సర్పంచ్ కోరారు.

## భగత్ సింగ్ ఆశయాలను నెరవేర్చుటకు యువత నడుం బిగించాలి

**వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఉప్పరి ప్రసాద్**



వికారాబాద్ బ్యూరో 24 మార్చి ప్రజాపాలన : భరతమాతకు దాస్య విముక్తి చేసే పోరాటంలో తెల్లవాడి గుండెలను చీల్చి చెండాడిన సమరయోధులు భగత్ సింగ్ సుఖ్ దేవ్ రాజ్ గురు అమరవీరుల త్యాగాలను స్మరిద్దామని వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఉప్పరి ప్రసాద్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ చౌరస్తాలో భగత్ సింగ్ సుఖ దేవ్ రాజ్ గురు వర్ధంతిని జిల్లా వై.ఎస్.ఆర్.టి.పి యూత్ ప్రెసిడెంట్ కొంపల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఉప్పరి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం వారి ప్రాణాలను సైతం లెక్క చేయక పోరాడిన మహనీయులను మరొక్కసారి స్మరిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా వైఎస్ఆర్ టి పి యూత్ ప్రెసిడెంట్ కొంపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ అమరవీరుల పోరాటాలను త్యాగాలను యువత ఎన్నటికీ మరువ రాదని హెచ్చరించారు. వారి ఆశయ సాధన కొరకు యువత ఆహర్నిశలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. దేశ స్వాతంత్రమే తమ హక్కుగా భావించి తమ ప్రాణాలను సైతం త్రుణప్రాయంగా సమర్పించిన మహనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కావలి వసంత్ కుమార్, ధారూర్ మండల ప్రెసిడెంట్ మద్దులపల్లి రత్నం మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, క్రమ శిక్షణ కమిటీ అధ్యక్షురాలు రజినీ, కొట్పల్లి మండల అధ్యక్షులు కమ్మరి విఠలాచారి, డ్వాక్రా సంఘ అధ్యక్షురాలు పద్మ, సుజాత, ఎల్. నారాయణ రెడ్డి, పి. శేకర్ రెడ్డి, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు బంద్యయ్య నందు నవీన్ సన్నీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికులకు నెలలో మొదటి తారీకు రోజే జీతాలు ఇవ్వాలి




ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 24 ప్రజాపాలన ప్రతినిది: తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా పాల్గొన్న బిజెపి వనపర్తి ఇంచార్జి శ్రీ బోసుపల్లి ప్రతా గారు మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు నూటికి 95 శాతం దళిత వర్గాల నుంచి ఉంటారు కాబట్టి వారికి ప్రతి నెల నెల మొదటి తారీకు నే తప్పనిసరిగా జీతాలు ఇవ్వాలని వారికి కు కూడ దళిత బంద్ పథకాన్ని పారిశుద్ధ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని ,పారిశుద్ధ కార్మికులందరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఉన్నవారికి 5,50000 ఆర్థిక సహాయం ఇవ్వాలని పి ఎఫ్ ఇ ఎస్ ఐ ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి కొత్త రామ్ రెడ్డి రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొంద్రు పురుషోత్తం కదారి శ్రీలత కౌన్సిలర్ పలుస శ్రవణ్ కుమార్ మైలారం బాబు మాడుగుల బాలకృష్ణ బి జె వై ఎం నాయకులు మల్లెల దేవేందర్ ఎల్మేటి నర్సింహా రెడ్డి యువ మోర్చా అధ్యక్షులు ఓబీసీ నాయకులు అజయ్ మల్లెల రమేష్ ఖానపురం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**చీమల్ దరి గ్రామ సర్పంచ్ నాసన్ పల్లి నర్సింహారెడ్డి**



వికారాబాద్ బ్యూరో 24 మార్చి ప్రజాపాలన : విద్యార్థులు తమ లక్ష్యాన్ని నెరవేర్చుకొనుటకు అహర్నిశలు కృషి చేయాలని చీమల్ దరి గ్రామ సర్పంచ్ నాసన్ పల్లి నర్సింహారెడ్డి హితవు పలికారు. ఇష్టంగా చదివితే ఏ సబ్జెక్టు కూడా కష్టంగా ఉండదని సూచించారు. గురువారం మోమిన్ పేట మండల పరిధిలోని చీమల్ దరి గ్రామంలోని పదవ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చీమల్ దరి గ్రామ సర్పంచ్ నాసన్ పల్లి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పంపిన పరీక్ష ప్యాడ్ లను ఎంపీటీసీ మానస ఇంద్రారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయాలని సూచించారు. పౌష్టిక ఆహారాన్ని తగు మోతాదులో తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. తరగతి గదిలో బోధించిన ప్రతి పాఠాన్ని జాగ్రత్తగా నెమరు వేసుకుంటూ ప్రత్యేకంగా టిప్స్ రూపంలో వ్రాసుకోవాలని తెలిపారు. ఎంపీటీసీ మానస ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు భయపడరాదని భరోసా కల్పించారు. రాత్రి సమయాలలో ఎక్కువగా నిద్ర కాయ రాదని సూచించారు. నిర్దిష్ట సమయసారిణిని రూపొందించుకొని అనుసరించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న సాయిజ తిరుమల్ రెడ్డి గోవర్ధన్ గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నారెడ్డి ఎం రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన బి ఆర్ ఎస్ నాయకులు



ఎర్రుపాలెం మార్చి 24 శుక్రవారం ప్రజా పాలన ప్రతినిధి స్థానిక ఎర్రుపాలెం మండల కేంద్రంలోని టిఆర్ఎస్ నాయకులు సీఎం ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేశారు గురువారం సీఎం పర్యటన పంట నష్టపరిహారానికి సంబంధించిన ప్రకటన పట్ల నేతలు సంతోషాన్ని వ్యక్తపరిచారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలకు కౌలు రైతులకు పదివేలు సహాయం నష్టపరిహారం చేస్తామని ప్రకటించడం పట్ల కెసిఆర్ కు మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ శాఖ మార్కెట్ మాజీ చైర్మన్ చావ.రామకృష్ణ ,ఎంపీపీ దేవరకొండ శిరీష ,బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు పంబి. సాంబశివరావు,కార్యదర్శి యన్నం .శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ సూరపనేని రామకోటేశ్వరరావు ,రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ వేమిరెడ్డి బాలరాజు రెడ్డి ,మహిళా మండలి అధ్యక్షురాలు పులి. శిరీష ,కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## టీబీ అంతం మన అందరి పంతం...: చైర్ పర్సన్ లత జయకర్

## పిహెచ్సి వైద్యులు పృథ్వి, కంటి వెలుగు డా. ప్రశాంత్



మధిర మార్చి 24 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీపరిధిలోప్రపంచ క్షయ వ్యాది నివారణ దినోత్సవ సందర్భంగా తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ తరపున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు జిల్లా క్షయ నివారణ సంస్థ అధికారులు డా. మాలతీ డా. సుబ్బారావు ఆదేశాల మేరకు మధిర మండలంలో పిహెచ్సి దెందుకూరు వైద్యులు, పారా మెడికల్ బృందం సంయుక్తంగా ఏర్పాటు చేసిన టీబీ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతాజయాకర్, కమిషనర్ రమాదేవి, 17వ వార్డ్ కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వర్లు పాల్గొని టీబీకి విలువైన మందులు ఉచితంగా ఉన్నాయి. అని 2025 నాటికీ టీబీని అంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరు పైన ఉన్నది అని ఆమె సూచించారు.సాయిబాబా కళ్యాణ మండపంలో టీబీ చిత్ర పటాన్ని ప్రజల అవగాహన నిమిత్తం ఆవిష్కరణ చేసినారు. అదే విధంగా అంబెడ్కర్ సెంటర్ లో డా. పృథ్వి మరియు పారా మెడికల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించడం జరిగింది. మధిర ప్రభుత్వం హాస్పిటల్ లో సీనియర్ వైద్యులు డా. కనకపూడి అనిల్ టీబీ గురించి మాట్లాడుతూ టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి ఆయన అన్నారు రాయపట్నంలో కంటి వెలుగు డా. కనకపుడి సునీత ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వారం, రెండు వారాలు మించి ఎడతెరిపి లేకుండా దగ్గు వస్తూనే వుంటే వెంటనే ఆశ కార్యకర్తలు ద్వారా తేమడా పట్టి పిహెచ్సి కీ పంపాలి అని ఆమె అన్నారుఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఐసిడిఎస్ సిబ్బంది డా. ప్రశాంత్ హెచ్ఎస్ సుబ్బలక్ష్మి టీబీ నోడల్ పర్సన్ లంకా కొండయ్య ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుజాత ఎఎన్ఎమ్ లు భారతి విజయ కుమారి విజయ విజయలక్ష్మి వై లక్ష్మి ఎఎన్ఎమ్ రాజేశ్వరి అరుణ,డి లీలా, సునీలా నాగమణి పల్లె దవఖానా మహదేవపురం సిహెచ్ఓ ఐశ్వర్య బస్తి దా పాల్గొన్నారు.

## అవగాహన తోనే క్షయవ్యాధి నిర్మూలన: జిల్లా కలెక్టర్ బధావత్ సంతోష్



మంచిర్యాల బ్యూరో, మార్చి 24, ప్రజాపాలన: అవగాహనతోనే క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలన చేయడం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బధావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా డిఎం అండ్ హేచ్ ఓ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టిబి పై అవగాహన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు తో కలిసి హాజరయ్యారు. ముందుగా క్షయవ్యాధి నివారణ కోసం తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం హిందూ సేవా సమాజ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు టీబి వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందించిన ఐదు పౌష్టికాహార కిట్లను టిబి విజేత లకు కలెక్టర్ అందజేశారు. అనంతరం వైద్యులు, మెడికల్ కళాశాల విద్యార్థులు చేపట్టిన టీవీ నివారణ చైతన్య ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 17 హెల్త్ ప్రైమరీ సెంటర్లు, పట్టణ సామాజిక కేంద్రాలు, ఐదు ట్రీట్మెంట్ యూనిట్లలో క్షయ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 183 క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని వీరికి పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం ప్రతినెల రూ 500/- ఇవ్వడం జరుగుతుందని అన్నారు. క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి అవగాహనతో వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది, వైద్య కళాశాల విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## విగ్రహాల ప్రతిష్టలో మల్లిబాబు యాదవ్..



తల్లాడ(కామేపల్లి), మార్చి 24 (ప్రజా పాలన న్యూస్): కామేపల్లి మండలం హరిశ్చంద్రాపురం గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజు, అభయాంజనేయ స్వామి దేవతల విగ్రహాలు అంగరంగ వైభవంగా పచ్చని తోరణాల మధ్య, బ్రహ్మశ్రీ వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల చేత శాస్త్రోక్తంగా వైభవంగా, ప్రతిష్టించడం జరిగింది. విశేష ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, భద్రాద్రి జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పాల్గొనగా సన్మానించారు. మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంతోటి అచ్చయ్య, సర్పంచ్ రాందాస్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల,ప్రసాదు, సుశీల, సాంబ,గ్రామ పెద్దలు రాందాస్,బన్సీ భాస్కర్ లాలు బాదావత్ నాగరాజు రాంజీ , రమేష్, దశరథ్, రామ్ సింగ్ రమేష్ పాల్గొన్నారు.

## తాసిల్దార్ రామ్మోహన్ రావు ను కలిసి వినతిపత్రం



ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 24 ప్రజాపాలన ప్రతినిధి : టీ ఏస్ పి ఎస్ సి పరిక్షలు జరిపించుటలో విఫలమైనందున దానికి సంబందించిన చైర్మెన్ జనార్ధన్ రెడ్డి వారి సభ్యులందరు ఆశాఖ మంత్రి – పర్యులను డిస్మిస్ చేసి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.తెలంగాణ రాష్ట్రం ఏర్పాడి దాదావు 9 సంవత్సరాలు కావస్తున్న ఎన్నో ఏండ్ల నుండి ఎగురు చూసున్న నిరుడ 30 లక్షల నుండి యువత యువకులు ఆశలపై నీళు చల్లె విధంగా 8 సంవత్సరాల తరువాత మొదటిసారి నిర్వహించిన గ్రూఫ్ 1 ఇతర అనేక ఉద్యోగాల నియామకాలపై సంబంధించిన పరీక్ష ప్రశ్న పత్రాలు లక్షలాది రూపాయలు అమ్ముకోని 30 లక్షల మంది నిరుద్యోగుల భవితవ్యం పశ్నార్థకం చేసిన మంత్రి వర్యులు టీఎస్పీఎస్సీ చైన్ జనార్ధన్ రెడ్డి వారి యొక్క సభ్యులను వెంటనే బర్తరన్ చేసి సిటి కాకుండా సిబిఐ చే విధారణ జరిపి దోషులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని భవిష్యత్తులో జరగబోయే ఎలాంటి పరిక్షలైన అత్యంత గోప్యంగా జాగ్రత్తగా నిర్వహించాలని నిర్వహితులను శిక్షగా జాగ్రత్తగా నిర్వహించి నిరురోగుల భవిష్యత్తుం కాపాడవలసిందిగా బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుంది ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోశాధికారి కొంద్రు రఘుపతి, మున్సిపల్ అధ్యక్షులు చింతపట్ల నాగేష్,ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు మచ్చ మహేందర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కొంద్రు కరుణాకర్, ఉపాధ్యక్షులు సిహెచ్ కర్ణాకర్, ఆదిభట్ల మున్సిపల్ అధ్యక్షుడు బంగారుగళ్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు,

## ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాద చర్యలను త్రిప్పికొట్టుదాం






ఇబ్రహీంపట్నం మార్చి తేదీ 24 ప్రజాపాలన ప్రతినిధి:బిజెపి మతోన్మాదం,కార్పొరేట్ విధానాలు వ్యతిరేకిస్తూ, సంక్షేమం, మతసామరస్యం, సామాజిక న్యాయం కోసం, బిజెపి విధానాలను ఎండగాడుతూ మార్చి 17 న వరంగల్ లో ప్రారంభమైన జన చైతన్య యాత్ర ఈనెల 28న రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి వస్తుందని, ఆరుట్ల నుంచి మంచాల మీదుగా యాచారం మండలం మాల్ చేరుకుని అక్కడి నుంచి సాగర్ హైవే మీదుగా ఇబ్రహీంపట్నం వస్తుందని, ఇబ్రహీంపట్నంలో భారీ బహిరంగ సభ ఉంటుందని ఈ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ళ భాస్కర్ పిలుపునిచ్చారు. ఈరోజు ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జన చైతన్య యాత్రకు సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన చైతన్య యాత్ర రథసారధిగా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ గారు ఈ యాత్రలో ఉంటారు. కావున ఈ బస్సు యాత్రకు ప్రజలు ,కార్మికులు, లౌకికవాదులు, సామాజిక సంఘాల నాయకులు, మహిళలు, మేధావులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాం.ఈకార్యక్రమంలో సీపీయం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల యాదయ్య, బి.సామేల్, బి.మధుసూధన్ రెడ్డి, డి.జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్.జంగయ్య, ఈ.నర్సింహ్మా, ఎ.నర్సింహ్మా, కే.శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్, కే.జగన్, రావుల జంగయ్య,గోరెంకల నర్సింహ, డి.కిషన్, సీహెచ్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా స్పాట్

## విరూపాక్ష" నుండి నచ్చావులే నచ్చావులే గ్లింప్స్ రిలీజ్!





మెగా హీరో హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా, సంయుక్తా మీనన్ హీరోయిన్ గా డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ విరూపాక్ష. ఈ చిత్రం ను ఏప్రిల్ 21, 2023 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి విడుదల అయిన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. తాజాగా ఈ చిత్రం లోని ఫస్ట్ సింగిల్ కి సంబంధించిన గ్లింప్స్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేయడం జరిగింది. నచ్చావులే నచ్చావులే అంటూ సాగే ఈ గ్లింప్స్ ఆకట్టుకుంటుంది. ఇందుకు సంబంధించిన పూర్తి పాట నేడు విడుదల కానుంది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ సంస్థల పై బివిఎస్ఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. పాన్ ఇండియా మూవీ గా వస్తున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ఇంట్రెస్టింగ్ టైటిల్, ఫస్ట్ లుక్ తో సుధాకర్ కొమకుల నెక్స్ట్..!



'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రంతో తెలుగు సినిమా ఆడియెన్స్ లో తనదైన ముద్ర వేసిన యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుధాకర్ కొమకుల. మరి ఆ తర్వాత మరికొన్ని ఇంట్రెస్టింగ్ చిత్రాలు హీరోగా అలాగే మరికొన్ని సినిమాల్లో కీలక పాత్రలలో కనిపించాడు. మరి ఈ యంగ్ హీరో అయితే నెక్స్ట్ ప్రాజెక్ట్ గా మరో ఎంటర్టైనర్ తో రాబోతున్నాడు. చిన్న పాపిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాకి మేకర్స్ అయితే "నారాయణ అండ్ కో" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ పెట్టగా మెయిన్ లీడ్ తో పాటుగా ఇతర పాత్రలతో డిజైన్ చేసిన పోస్టర్ బాగుంది. మెయిన్ కాస్ట్ అంతా హ్యాపీ గా ఒకేలా నవ్వుతూ కనిపిస్తున్నారు. ఇక ఈ సినిమాకి అయితే ఎక్స్ పీరియన్స్ ది తిక్కల్ ఫ్యామిలీ అంటూ ఇచ్చిన క్యాప్షన్ మరింత ఆసక్తిగా క్రేజీగా ఉందని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి అయితే ముగ్గురు సంగీత దర్శకులు సురేష్ బొబ్బిలి, నాగ వంశీ అలాగే జోస్య భట్ల వర్క్ చేస్తుండగా పూజా కిరణ్, దేవి ప్రసాద్, ఆమని తదితరులు కీలక పాత్రల్లో నటిస్తుండగా పాపిశెట్టి బ్రదర్స్ మరియు సుధాకర్ కూడా ఈ సినిమాకి నిర్మాణం వహిస్తున్నాడు. మరి ఈ సినిమా అయితే అతి త్వరలోనే రిలీజ్ కానుంది.

## చిరు ఎంట్రీతో వెంకీ కుడుముల సేఫ్..!




వెంకీ కుడుముల నితన్ రష్మిక మందన్నా కాంబినేషన్ వచ్చిన భీష్మ సినిమా మంచి పాజిటివ్ టాక్ తో హిట్టు కొట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే కాంబోలో మరో మూవీ కూడా తెరకెక్కుతోంది. ఇందుకు సంబంధించి రెండ్రోజుల క్రితం అఫీషియన్ అనౌన్స్ మెంట్ కూడా వచ్చేసింది. VNRTrioపేరుతో ఈ సినిమా తెరకెక్కనుంది. అయితే అంతకుముందు చిరంజీవితో వెంకీ కుడుముల సినిమా ఉంటుందన్న అంచనాలను ఇది తలకిందులు చేసింది. చిరు కాదనడంతోనే వెంకీ కుడుముల నితిన్ తో సినిమా తెరకెక్కిస్తున్నాడని విమర్శలు వచ్చాయి. అలా మెగా ఫ్యాన్స్ నుండి కూడా వెంకీ కుడుములపై నెగెటివ్ టాక్ వినిపించింది. అయితే మెగాస్టార్ కోసం వెంకీ కుడుముల రెడీ చేసిన స్క్రిప్ట్ చిరుకు నచ్చకపోవడంతోనే ఆ కాంబోలో సినిమా రావడం లేదన్న వార్తలు వచ్చాయి. అయితే వాటిని పటాపంచలు చేసేలా ఈ కొత్త సినిమా పూజా కార్యక్రమంలో చిరు పాల్గొన్నారు. VNRTrio మూవీ పూజా కార్యక్రమానికి చిరు హాజరై.. చిరు – వెంకీ కుడుముల ప్రాజెక్టు ఉంటుందన్న సంకేతాలు ఇచ్చారు. త్వరలోనే వీరిద్దరూ కలిసి ఓ ప్రాజెక్టులో భాగం అవుతారని అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. చిరు–వెంకీ ప్రాజెక్టు ఉన్నా లేకపోయినా వెంకీపై ఉన్న నెగెటివిటీ మాత్రం తొలగిపోయింది. VNRTrio మూవీకి సంబంధించి పరిచయ వీడియో నిన్న రిలీజ్ అయింది. దీనికి అన్ని వర్గాల నుండి పాజిటివ్ టాక్ వచ్చింది. ఇందులో రష్మిక నితిన్ ఎవరికి వాళ్లు సెల్ఫ్ సెటైర్లు గట్టిగానే వేసుకున్నారు. రష్మిక మాట్లాడుతూ తాను ఒక్క మాట మాట్లాడితే రెండు మూడు కాంట్రవర్సీలు అవుతున్నాయి అని అంటుంది. ఇందుకు నితిన్ అది చాలా బెటర్.. నేను ఒక్క హిట్ ఇస్తే రెండు మూడు ఫ్లాప్ లు అవుతున్నాయని తనపై తానే సెటైర్ వేసుకుంటాడు. ఆ తర్వాత సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఎంట్రీ అదిరిపోయింది. జీవీ ప్రకాష్ పైనా ఇందులో కామెంట్ చేశారు. భీష్మ సినిమా విడుదలైన మూడేళ్లకు ఈ సినిమా మొదలవుతుందని నితిన్ కామెంట్ చేస్తాడు.

## కీర్తితో పేడ కలిపించారట

కీర్తి సురేష్ సరైన హిట్ అందుకొని చాలా కాలమే అయింది. మహానటి తర్వాత కీర్తి సురేష్ ఆ స్థాయిలో చెప్పుకోదగ్గ హిట్టు లభించలేదు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆ సినిమా తర్వాత కీర్తి సురేష్ దసరా సినిమా విషయంలోనే చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. సినిమా ఇంకా విడుదల కూడా అవ్వకుండానే సినిమా యూనిట్లో పనిచేసిన 130 మందికి గోల్డ్ కాయిన్స్ పంచింది అంటే సినిమా మీద ఎంత నమ్మకం పెట్టుకుందో ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు. అయితే ఈ సినిమా కోసం తన చేత పేడ కూడా కల్పించారు అనే విషయాన్ని తాజాగా కీర్తి సురేష్ బయటపెట్టింది. దసరా సినిమా మార్చి 30వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఈ సినిమాని ప్రమోట్ చేస్తున్నారు. కేవలం తెలుగులోనే కాదు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో సైతం రిలీజ్ అవుతున్న నేపథ్యంలో అక్కడికి కూడా వెళ్లి సినిమా యూనిట్ ప్రమోషన్స్ చేస్తోంది. అయితే తాజాగా సినిమా యూనిట్ తో యాంకర్ సుమా చేసిన ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దానికి సంబంధించిన క్లిప్స్ అన్ని ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కీర్తి సురేష్ సినిమా షూటింగ్ కి సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టింది. అదేమిటంటే తనను అంత ఈజీగా ఏమీ సెలెక్ట్ చేయలేదని తన లుక్ టెస్ట్ కోసం తన చేత పేడ కనిపించారని చెప్పుకొచ్చింది. ముందుగా ముగ్గు వేయించి బావి నుంచి నీళ్లు తోడించి ఆ తర్వాత పేడ కల్పించారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాని కల్పించుకుని ఆమెకు నిజం పేడ ఇవ్వాలా లేక ఆర్ట్ డైరెక్టర్ సిద్ధం చేసిన పేడ లాంటి పదార్థం ఇవ్వాలా అని అనుకుంటున్న సమయంలో డైరెక్టర్ పేడ ఇవ్వమని అన్నారని కీర్తి సురేష్ ఏమిటి ఏమి



ఆలోచించకుండా వెళ్లి పేడ కలిపిన విధానం చూస్తే ఈమె హీరోయిన్ కాక ముందు ఏం చేసేది అని మాకే డౌట్ వచ్చిందని అంటూ నవ్వులు పూయించారు.

## ఆ సీక్వెల్ కోసం మైండ్ బ్లాక్ రెమ్యునరేషన్..!



కన్నడలో కె.జి.ఎఫ్ చాప్టర్ 1 2 ఎన్ని రికార్డులు సృష్టించిందో ఆ తర్వాత అదే రేంజ్ రికార్డులతో రచ్చ చేసిన సినిమా కాంతార. రిషన్ శెట్టి హీరోగా నటించి డైరెక్ట్ చేసిన ఈ సినిమా 20 కోట్ల బడ్జెట్ తో తీస్తే 400 కోట్ల వసూళ్లను రాబట్టింది. కాంతార సినిమాకు రిషబ్ శెట్టి 5 కోట్ల దాకా రెమ్యునరేషన్ తీసుకున్నట్టు తెలుస్తుంది. అయితే కాంతార సెన్సేషనల్ హిట్ అవడంతో సీక్వెల్ కి తన రెమ్యునరేషన్ కూడా పెంచేశాడు. కాంతార సినిమా నిర్మాతలకు భారీ లాభాలు తెచ్చి పెట్టింది. అందుకే ఈ సీక్వెల్ ని భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. రీసెంట్ గానే సీక్వెల్ స్క్రిప్ట్ మొదలు పెట్టిన రిషబ్ శెట్టి కాంతారా 2 కోసం బ్లాస్టింగ్ రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. కాంతార 1 కి కేవలం ఐదు కోట్లు తీసుకున్న రిషబ్ ఆ రెమ్యునరేషన్ లోనే డైరెక్షన్ హీరోగా చేశాడు. కానీ కాంతార 2 కోసం మాత్రం అతను భారీగా డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తుంది. తెలుస్తున్న సమాచారం ప్రకారం కాంతారా 2 కోసం రిషబ్ 100 కోట్ల దాకా రెమ్యునరేషన్ అందుకుంటున్నట్టు తెలుస్తుంది. అయితే ఇందులో 50 కోట్లు రెమ్యునరేషన్ లాగా.. మరో 50 కోట్లు బిజినెస్ లో షేర్ లాగా తీసుకుంటున్నాడట. ఎలా చూసినా సరే రిషబ్ శెట్టికి ఈ సీక్వెల్ తో 100 కోట్ల దాకా రెమ్యునరేషన్ వస్తున్నట్టు తెలుస్తుంది. కాంతారా 2 మీద ఆడియన్స్ అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే వారు ఎన్ని అంచనాలతో వచ్చినా వాటికి మించి ఈ సినిమా ఉంటుందని అంటున్నారు చిత్రయూనిట్. ఈసారి బడ్జెట్ కూడా భారీగా పెడుతున్నారు కాబట్టి సినిమా నెక్స్ట్ లెవల్లో ఉండబోతుందని అంటున్నారు. కాంతారా 2 రిలీజ్ కూడా గ్రాండ్ గా ఉండబోతుంది. కాంతార 1 ని అల్లు అరవింద్ తెలుగులో రిలీజ్ చేశారు. ఇక ఇప్పుడు కాంతారా 2ని కూడా ఆయనే భారీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## ఉస్తాద్ భగత్ సింగ్" పై లేటెస్ట్ అప్డేట్.!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు ఓ రీమేక్ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో శరవేగంగా జరుగుతూ ఉండగా ఈ షూటింగ్ కోసం పవన్ 22 రోజులు మేర డేట్స్ కేటాయించగా ఇది ఆల్ మోస్ట్ కంప్లీట్ కావస్తుంది. ఇక తన ఎన్నికల ప్రచారం లోపు అయితే మిగతా సినిమాలు కూడా పైప్ లైన్ లో పెట్టుకొని శరవేగంగా కంప్లీట్ చేయాలని చూస్తున్న పవన్ ఇప్పుడు అయితే నెక్స్ట్ గా "ఉస్తాద్ భగత్ సింగ్" ని స్టార్ట్ చేయనున్న సంగతి తెలిసిందే. దర్శకుడు హరీష్ శంకర్ తో ప్లాన్ చేస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ మంచి అంచనాలు నెలకొల్పుకోగా దీనిపై లేటెస్ట్ అప్డేట్ అయితే ఇప్పుడు తెలుస్తుంది. ఈ సినిమా షూటింగ్ ని అయితే మేకర్స్ ఈ ఏప్రిల్ 5 నుంచి స్టార్ట్ చేయనున్నట్టుగా ఫిక్స్ చేశారట. మరి ఆల్రెడీ ఈ సినిమాకి మేకర్స్ భారీ సెట్టింగ్ పనులు చేస్తున్న సంగతి తెలిసిందే. షూట్ కి సంబంధించి అయితే అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి అయితే దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

మాస్టర్ కీ టీవీ ఛానల్

మీడియాలో స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి ఆహ్వానం

మీ వార్తకు మీరే యజమాని..!

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో ఉన్న టీవీ ఛానెల్స్ అన్నీ.. మూడు పొలిటికల్ పార్టీలుగా విడిపోయి వారు ఆయా పార్టీలకు అనుకూలమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదు.

ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరి మనోభావాలను, సమస్యలను ప్రతీ రోజు మీరు పంపిన యెడల వాటిని మా ఛానెల్ ద్వారా ప్రసారం చేయబోతున్నాం.

ప్రతి పౌరుడికి మీడియా ద్వారా ఎంపవర్ చేయడమే మా ధ్యేయం. ఈ సాధికారత వల్ల ప్రజలు తమ సమస్యల పట్ల చైతన్యం కలిగి సమాజ శ్రేయస్సుకు చేయూతనివ్వగలుగుతారు.

ఇందుకు మీకు కలిగే లాభాలు :
1. సొంత సమస్యలు గాని, ప్రజా సమస్యలు గాని పరిష్కారం అయ్యే మార్గాలు.
2. నాయకునిగా ఎదిగే అవకాశం
3. మీ ద్వారా వచ్చే ప్రకటనలపై 50 - డిస్కౌంట్.
4. మీ పెట్టుబడి ఎక్కువ రేట్లు అయ్యే అవకాశం.

ఇందుకు మీరు చేయవలసిందల్లా వాటాదారునిగా చేరటమే.

మీరు మీ కుటుంబ సభ్యులందరూ కలిపి స్వతంత్ర్య యజమానిగా హక్కులు తీసుకోవడానికి రూ. 2 లక్షలు అంతకు మించిన విలువ చేసే వాటాలు తీసుకోవాలి.

మీకు కావాలంటే 2026 వ సంవత్సరం తర్వాత మీ వాటాలను మార్కెట్లో తిరిగి అమ్ముకునే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం కేబుల్ టీవీ ఛానెల్ గా ఉన్న మాస్టర్ కీ టీవీ త్వరలోనే శాటిలైట్ ఛానెల్ గా మారనుంది.

పతి ఒక్కరినీ భాగస్వామ్యులు కావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం. రాజ్యాధికార సాధనకు MAMలో భాగమైన మీడియాను బలోపేతం చేద్దాం.

రండి..! కదలి రండి..!

వివరాలకై సంప్రదించండి...

91549 58315 - 76600 27683

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989